


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510








Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 332 | పేజీలు - 08 | వెల - 05/- | ఆదివారం 29-11-2026


# బార్ అసోసియేషన్‌కు 131 ఏళ్ల ప్రస్థానం


**రాజమండ్రి కోర్టు, బార్ అసోసియేషన్ చారిత్రక వేడుకల్లో చంద్రబాబు ప్రసంగం**

- భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థల పటిష్ఠతపై సీఎం ప్రశంసలు
- కోర్టు కేసుల వేగవంతమైన పరిష్కారానికి లీగల్ ఏఐ స్టాక్
- ప్రత్యామ్నాయ విధానాల ద్వారానే సత్వర న్యాయం సాధ్యమని ఉద్ఘాటన
- అమరావతికి అండగా నిలిచిన హైకోర్టు తీర్పుల ప్రస్తావన

**వచ్చే ఏడాది పోలవరం పూర్తి, గోదావరి పుష్కరాల నిర్వహణ.. న్యాయమూర్తులకు ఆహ్వానం**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తీవ్ర సంక్షోభాలను ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశంలో నాలుగు ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా ఉండడం వల్లనే దేశం వాటన్నింటినీ తట్టుకుని స్థిరంగా ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవస్థ కూడా ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222 ఏళ్లు, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన వేడుకల్లో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి.నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావుతో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సావనీర్‌ను

మిగతా 2లో



## డీలిమిటేషన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం!

**దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం యువత గళం విప్పాలని రాహుల్ పిలుపు**

**లోక్‌సభ స్థానాలను 850కి పెంచే యోచనపై రాహుల్ గాంధీ అభ్యంతరం**

**మహిళా రిజర్వేషన్ల అమలుకు ప్రస్తుతమున్న 543 స్థానాలే సరిపోతాయన్న ప్రకటన**

**తాజా కులగణన ఆధారంగానే నియోజకవర్గాల ప్రక్రియ చేపట్టాలన్న డిమాండ్**

**రాజ్యాంగ విలువల రక్షణకు ముందుకు రావాలని చంద్రబాబు, జగన్‌లకు విజ్ఞప్తి**



దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ తక్షణమే స్పందించి గళమెత్తాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న డీలిమిటేషన్ విధానాలు ప్రజాస్వామ్య మనుగడకే ముప్పుగా మారుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో ఉన్నవారైనా, బయట ఉన్నవారైనా దేశ భవిష్యత్తు కోసం కళ్లు తెరవాలని, చంద్రబాబు, జగన్ వంటి నేతలు రాజ్యాంగ రక్షణ కోసం ముందడుగు వేయాలని ఆయన కోరారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి

మిగతాది 2లో

## ఆరోపణలపై రాజకీయ వర్గాల్లో కలకలం

**డీలిమిటేషన్ బిల్లుకు ఎన్సీపీ (ఎస్పీ) మద్దతు సంకేతాలు.. భగ్గుమన్న మిత్రపక్షాలు**

**ఇండియా కూటమి వ్యూహాత్మక భేటీకి దూరంగా శరద్ పవార్ వర్గం**

**డీలిమిటేషన్ బిల్లు చుట్టూ ముదిరిన మహారాష్ట్ర విపక్షాల అంతర్గత పోరు**

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన డీలిమిటేషన్ బిల్లు మహారాష్ట్ర ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో తీవ్ర విభేదాలకు దారితీసింది. ఈ బిల్లు విషయంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) వైఖరిపై శివసేన (యూబీటీ) రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



## మహిళా రిజర్వేషన్లపై ప్రధాని కీలక ప్రకటన

- నారీశక్తికి ఇచ్చిన మాటను నెరవేర్చి తీరుతామన్న ప్రధాని మోదీ
- మహిళా రిజర్వేషన్ల మార్గంలో ఉన్న ప్రతి అడ్డంకిని తొలగిస్తామని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా నానుతున్న బిల్లు సాధన కోసం తానూ శ్రమిస్తున్నానని వెల్లడి
- మహిళా సాధికారత విషయంలో తమ సంకల్పాన్ని ఎవరూ ఆపలేరని ప్రకటన

మిగతాది 2లో



## నేడు పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్

**బాగా పనిచేసిన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని వెల్లడి**

- రెండో విడత పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై లోకేశ్ సమీక్ష
- కూటమి బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపు
- కూటమి పార్టీల మధ్య పూర్తిస్థాయిలో ఓటు బదిలీ జరగాలని స్పష్టీకరణ
- రెబల్స్ అంశంపై స్థానిక నాయకత్వంతో చర్చించి పరిష్కరించాలని సూచన



రాష్ట్రంలో రేపు (నవంబరు 29) జరగనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన

మిగతాది 2లో

## డీలిమిటేషన్

**బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**

- ఎక్స్ వేదికగా కీలక నిర్ణయాన్ని వెల్లడించిన కేటీఆర్
- బిల్లుకు అనుకూలంగా ఓటు వేయనున్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు
- తెలంగాణ లోక్‌సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26కు పెరిగే అవకాశం
- 2051 వరకు రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా మారకుండా రక్షణపై హర్షం



## లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు

**మహిళలు నిర్ణయాధికారులుగా ఎదగాలన్న హోంమంత్రి**

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏపీ హోంమంత్రి అనిత కీలక వ్యాఖ్యలు
- చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యం దక్కాలని వ్యాఖ్య



మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నవంబర్ 30న ప్రారంభం కానున్న లోక్‌సభ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

మిగతాది 2లో

## అధికారాన్ని శాశ్వతంగా చేతుల్లోకి తీసుకునేందుకే..

- డీలిమిటేషన్ బిల్లు ప్రజాస్వామ్యానికి పెను ముప్పు అన్న మల్లికార్జున ఖర్గే
- లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచడం శాశ్వత అధికారం కోసమేనని ఆరోపణ
- ఎస్సీ, ఎస్టీలకు సీట్ల పెంపుపై బిల్లులో ఎలాంటి స్పష్టత లేదని విమర్శ
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విశ్వసనీయతపై ప్రశ్నలు
- ఏప్రిల్‌లో బిల్లు వీగిన విపక్ష పార్టీలను బీజేపీ చీల్చిందని ధ్వజం



కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లు ప్రజాస్వామ్యానికి పెను ముప్పు అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో అధికారాన్ని శాశ్వతంగా తమ చేతుల్లోకి తీసుకునేందుకే మోదీ ప్రభుత్వం ఈ కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. కేంద్ర మంత్రివర్గం ఆమోదం పొందిన ఈ రాజ్యాంగ సవరణ బిల్లును నవంబర్ 30న ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, ఢిల్లీలోని ఇండియా కూటమి నేతల భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కి పెంచడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని

## జగ్గారెడ్డి ఇంటికి హరీశ్ రావు

- జగ్గారెడ్డి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించిన హరీశ్ రావు
- సుమారు 21 ఏళ్ల తర్వాత తొలిసారి ఫ్యామిలీ ఫంక్షన్‌లో కలిసిన నేతలు
- 2004లో హరీశ్ చాంబర్‌లోనే భోజనం చేసేవాళ్లమని గుర్తుచేసుకున్న జగ్గారెడ్డి
- కూతురి పెళ్లికి పిలవలేకపోయా.. కుమారుడి వేడుకకు పిలిచానన్న కాంగ్రెస్ నేత
- తమ భేటీ వెనుక ఎలాంటి రాజకీయాలు, అంతరార్థాలు లేవని స్పష్టీకరణ



# డీలిమిటేషన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం

రాహుల్ గాంధీ తన ప్రసంగంలో లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి ఏకంగా 850కి పెంచాలనే ప్రతిపాదనను తీవ్రంగా తప్పుపట్టారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ ఎత్తుగడను తెరపైకి తెస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందిందని, ప్రస్తుతమున్న 543 స్థానాల్లోనే దానిని తక్షణమే అమలు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. అలాంటప్పుడు సీట్లను 850కి పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ 850 సంఖ్య భారత ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీసే చర్య అని ఆయన ఆరోపించారు.

ఎన్నికల నియోజకవర్గాల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకే బీజేపీ ఈ కొత్త మార్గాన్ని ఎంచుకుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక చిత్రకారుడి చేతికి ఖాళీ కాన్వాస్ ఇస్తే నచ్చిన బొమ్మ గీసుకున్నట్లుగా, బీజేపీకి 850 సీట్లతో మొత్తం దేశ ఎన్నికల మ్యాప్‌ను ఇష్టానుసారంగా మార్చే వెసులుబాటు లభిస్తుందని అన్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న ఓటర్లు, వర్గాలను బలహీనపరిచేందుకు, విపక్ష నాయకులను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఈ సరిహద్దుల మార్పును వాడుకుంటారని ఆయన హెచ్చరించారు.

ఈ సందర్భంగా అస్సోం, జమ్మూకశ్మీర్‌లలో జరిగిన పునర్విభజన ప్రక్రియలను రాహుల్ గాంధీ ఉదాహరణగా ప్రస్తావించారు. అక్కడ అనుసరించిన 'ప్యాక్ అండ్ క్రాక్' వ్యూహాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఒకే నియోజకవర్గంలోని లక్షలాది మంది ఓటర్లను మరో చోటికి మార్చడం, భౌగోళిక సంబంధం లేని ప్రాంతాలను కలిపి సరిహద్దులను విడగొట్టడం వంటి పద్ధతులను అస్సోంలో బీజేపీకి లబ్ధి చేకూరేలా చేశారని ఆరోపించారు. ఇదే తరహా విధానాన్ని మొత్తం దేశానికి విస్తరిస్తే ఎన్నికలు జరగకముందే ఫలితాలు ఒకవైపు మొగ్గే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

డీలిమిటేషన్ కమిషన్ స్వరూపంపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పక్షపాతంగా వ్యవహరిస్తోందని, ఇప్పుడు ప్రతిపాదిత కమిషన్‌లో ప్రభుత్వ నామినీలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రభావమే ఎక్కువగా ఉండేలా నిబంధనలు తెస్తున్నారని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన రాహుల్, ఆయన నేతృత్వంలో నిష్పాక్షిక పునర్విభజన సాధ్యం కాదని అన్నారు. ఈ కమిషన్ తీసుకునే నిర్ణయాలను న్యాయస్థానాల్లో సవాలు చేసే అవకాశం లేకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిష్పాక్షికమైన, అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర కమిషన్‌ను డిమాండ్ చేస్తోందని తెలిపారు.

సామాజిక న్యాయం అంశాన్ని ప్రస్తావిస్తూ, తాజా జనాభా లెక్కలు, కుల గణనను పరిగణనలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలని చూడటం అన్యాయమని రాహుల్ గాంధీ అన్నారు. ఓబీసీలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల ప్రాతినిధ్యాన్ని అణచివేసేందుకే కుల గణన నివేదికలను పక్కన పెడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల సంఖ్యను వచ్చే 40 ఏళ్లపాటు పెరగకుండా స్తంభింపజేయడం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు గొడ్డలిపెట్టు అని ఆయన మండిపడ్డారు.

గత 2024 లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 14 కోట్ల మంది ఓటర్ల అర్హతలపై పలు అనుమానాలు ఉన్నాయని, ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సమాచారమే స్పష్టం చేస్తోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల్లో అక్రమ మార్పులు, ఓట్ల తొలగింపు, చేర్పులు జరిగాయని పలు ఉదాహరణలతో వివరించారు. ఈ అవకతవకలను తాము నిరంతరం ఎండగడుతుండటంతో, తప్పించుకునేందుకు ప్రభుత్వం ఇప్పుడు డీలిమిటేషన్ రూపంలో కొత్త ఎత్తుగడలు వేస్తోందని ఆరోపించారు. దేశంలోని యువత, ముఖ్యంగా జెన్-జీ దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ముందుకు రావాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. యువతరం దేనికీ భయపడటం లేదని, వారి పోరాట పటిమ దేశానికి స్ఫూర్తినిస్తోందని అన్నారు. ప్రజలు ఎన్నికల వ్యవస్థపై నమ్మకం కోల్పోతే దేశ సమగ్రతకే పెను ముప్పు వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలు కొనసాగితే తాము చూస్తూ ఊరుకోబోమని, పార్లమెంటు లోపల, బయట పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే ప్రయత్నాలను ఎంతమాత్రం సహించబోమని, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి గూడుకట్టుకుందని, ఏ నియోజకవర్గాల పునర్విభజన కూడా పాలకులను ఓటమి నుంచి కాపాడలేదని ఆయన స్పష్టం చేశారు. తక్షణమే ప్రాంతీయ పార్టీలు, విపక్షాలు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన ముగించారు.

# బార్ అసోసియేషన్‌కు 131 ఏళ్ల ప్రస్థానం

సీనియర్ న్యాయవాదులు, విశ్రాంత న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.

న్యాయ పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. కోర్టు కేసుల నిర్వహణ, లీగల్ గవర్నెన్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 'లీగల్ ఏఐ స్టాక్'ను అందుబాటులోకి తీసుకురానుందని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ ద్వారా 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల రూపకల్పన, చట్టాలు, నిబంధనలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైకి తెస్తామని వివరించారు.

రాజ్యాంగ విలువలను కాపాడుతూ సామాన్యుడికి సకాలంలో న్యాయం అందించడమే అందరి లక్ష్యం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కోర్టుల్లో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండకుండా లోక్ అదాలత్‌లు, ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం కూడా ప్రతివాదిగా ఉన్న వివాదాలను కోర్టుల సహకారంతో త్వరగా పరిష్కరించి ప్రజలకు ఊరట కల్పించాలనేది ప్రభుత్వ ఆలోచనగా చెప్పారు. పూర్వం తాటి ఆకులపై తీర్పులు రాసిన నాటి నుంచి నేడు ఏఐ పరిజ్ఞానం వాడే స్థాయికి న్యాయవ్యవస్థ ఎదగడం గొప్ప పరిణామమని అన్నారు. 1849లోనే అధికారిక గుర్తింపు పొందిన సీతానగరం రచ్చబండ ప్రజా కోర్టు చరిత్రను ఆయన గుర్తుచేశారు.

గతంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఇచ్చిన చారిత్రక తీర్పు రాజధాని అమరావతిని, రాష్ట్రాన్ని కాపాడిందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. అలాగే ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ లీసా గిల్ చరిత్రలో నిలిచారని అభినందించారు.

దేశ 9వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా సుబ్బారావు రాజమండ్రి బార్ అసోసియేషన్‌లోనే ప్రాక్టీస్ చేశారని, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి వీరులు ఇక్కడి నుంచే న్యాయవాద వృత్తిని చేపట్టారని గుర్తుచేసుకున్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో పాటు స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామని, వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని సీఎం వెల్లడించారు. పుష్కరాల పవిత్ర స్నానాలకు రావాల్సిందిగా న్యాయమూర్తులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

# అధికారాన్ని శాశ్వతంగా చేతుల్లోకి తీసుకునేందుకే..

లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కి పెంచడం వెనుక



ఉన్న అసలు ఉద్దేశం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఖర్గే మండిపడ్డారు. ఈ సవరించిన బిల్లు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 330 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వ్‌డ్ స్థానాల పెంపుపై బిల్లులో ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని దుయ్యబట్టారు. త్వరలో 2026 జనాభా లెక్కలు రానున్నప్పటికీ, ఆ వివరాల ఆధారంగా కాకుండా తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల మేరకే సరిహద్దులను మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

డీలిమిటేషన్ ప్రక్రియ బాధ్యతలను కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) అప్పగించాలన్న ప్రతిపాదనను ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదని, ఇప్పటికే ఆయన ఆరోపణల బోనులో నిలబడ్డారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ద్వారా తమకు నచ్చిన స్థానాలను జనరల్ గానూ, ఇష్టం వచ్చిన వాటిని రిజర్వ్‌డ్‌గానూ మార్చేసి తీవ్ర అవకతవకలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లో ఈ బిల్లు వీగిపోయిన తర్వాత సంఖ్యాబలం కోసం బీజేపీ కుయుక్తులు పన్నిందని ఖర్గే ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన వంటి ప్రతిపక్ష పార్టీలను చీల్చి, విపక్షాలను బలహీనపరిచి ఇప్పుడు మళ్లీ బిల్లును ముందుకు తెస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే దేశానికి తీరని నష్టం వాటిల్లుతుందని, పార్లమెంట్‌లో ఇండియా కూటమి కలిసికట్టుగా దీనిపై పోరాడుతుందని స్పష్టం చేశారు.

### మహిళా రిజర్వేషన్లపై ప్రధాని
# కీలక ప్రకటన

దేశంలోని నారీశక్తికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలులో ఎదురయ్యే ప్రతి అడ్డంకిని తొలగిస్తామని హామీ ఇస్తూ ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కీలక ప్రకటన చేశారు. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగకుండా ఏ శక్తీ అడ్డుకోలేదని తేల్చిచెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని ప్రధాని గుర్తుచేశారు. ఈ హక్కును సాధించడం కోసం నిరంతరం కృషి చేస్తున్న వారిలో తానూ ఒకడినని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు ఈ అంశాన్ని వ్యక్తిగతంగా తన దృష్టికి తెచ్చారని, లెక్కలేనన్ని ఉత్తరాలు రాసి తమ ఆకాంక్షలను పంచుకున్నారని తెలిపారు. దేశంలోని నారీశక్తి ఆశీస్సులు, సంపూర్ణ మద్దతు తమ ప్రభుత్వానికే ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహిళలకు చట్టసభల్లో సముచిత వాటా కల్పించే విషయంలో తమ దృఢ సంకల్పాన్ని ఎవరూ ఆపలేరని ప్రధాని హెచ్చరించారు. ఈ బిల్లును వ్యతిరేకించే రాజకీయ పార్టీలు అసెంబ్లీలు, పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యాన్ని ఎప్పటికీ అడ్డుకోలేవని స్పష్టం చేశారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరగడం కేవలం కొద్దిరోజుల వ్యవధి మాత్రమేనని, ఇచ్చిన మాట ప్రకారం మహిళా సాధికారతను త్వరలోనే సంపూర్ణంగా సాకారం చేస్తామని ప్రధాని తేల్చిచెప్పారు.

# యాసిడ్ అమ్మకాలపై పూర్తి నిషేధం..

దేశంలో యాసిడ్ దాడులను శాశ్వతంగా నిరోధించే దిశగా సుప్రీంకోర్టు సంచలన ప్రతిపాదనలు చేసింది. ప్రైవేటు వ్యక్తులు రిటైల్‌గా యాసిడ్ అమ్మడంపై పూర్తిస్థాయిలో నిషేధం విధించాలని సూచించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, డోర్ డెలివరీ సర్వీసుల ద్వారా యాసిడ్ విక్రయాలను కూడా తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది.

ఎలాంటి నియంత్రణ లేకుండా యాసిడ్ సులభంగా అందుబాటులో ఉండటమే దాడులు కొనసాగడానికి ప్రధాన కారణమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్రంగా అభిప్రాయపడింది.

యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా నవంబర్ 23న ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జారీ చేసిన మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కాకపోవడంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కొత్త ప్రతిపాదనలు ఇవే..

కొత్త ప్రతిపాదనల ప్రకారం, ఇకపై వైద్య అవసరాల కోసం యాసిడ్‌ను కేవలం ప్రభుత్వ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న ఫార్మసీల ద్వారా మాత్రమే విక్రయించాలి. దానికి కూడా జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్ లేదా సివిల్ సర్జన్ నుంచి ముందస్తుగా లిఖితపూర్వక అనుమతి తప్పనిసరి. యాసిడ్ కొనుగోలు చేసే వ్యక్తి గుర్తింపు, చిరునామా, సంప్రదింపుల వివరాలు, ఎంత పరిమాణంలో కొంటున్నారు, ఏ ప్రయోజనం కోసం వినియోగిస్తున్నారు అనే వివరాలతో కూడిన నిర్దిష్ట ఫారమ్‌ను నింపాల్సి ఉంటుంది. అంతేకాకుండా, యాసిడ్ దుర్వినియోగానికి సంబంధించి కొనుగోలుదారుడిపై పూర్తి బాధ్యత మోపాలని సుప్రీంకోర్టు సూచించింది. కొనుగోలుదారుడికి తెలియకుండా వేరొకరు ఆ యాసిడ్‌ను దుర్వినియోగం చేసినా, దాని బాధ్యత కొన్నవారే వహించాల్సి ఉంటుంది. బాధితుల చికిత్స ఖర్చులు లేదా పరిహారం చెల్లింపు కోసం, అవసరమైతే కొనుగోలుదారుడి స్థిరాస్తుల వివరాలు సేకరించి వాటిని జప్తు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని కోర్టు పేర్కొంది. 2013లో 'లక్ష్మి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఇచ్చిన ఆదేశాలు, పాయిజన్స్ యాక్ట్-1919 కింద ఉన్న నిబంధనలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

# నేడు పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ గెలిపించేందుకు ప్రతిఒక్కరూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు. ఇటీవల పట్టణ, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి తోడ్పడ్డాయని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల్లో కూటమి పట్ల సానుకూల వాతావరణం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని రెండో విడత పంచాయతీ ఎన్నికలను కూడా నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఎన్నిక ఎంతో ముఖ్యమైనదని, బూత్ స్థాయి నుంచే పకడ్బందీ ఎన్నికల వ్యూహాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఓటూ ఎంతో కీలకమని గుర్తు చేస్తూ, క్షేత్రస్థాయిలో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని లోకేశ్ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఎక్కడైనా రెబల్స్ సమస్యలు ఉంటే స్థానిక నాయకత్వంతో మాట్లాడి వెంటనే పరిష్కరించుకోవాలని ఆదేశించారు. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమస్యయం కొనసాగాలని, ఓట్లు వంద శాతం బదిలీ అయ్యేలా నేతలు, శ్రేణులు బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. మంచి ఫలితాలు సాధించిన వారికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. మొదటి విడత కంటే రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కూటమి శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 1,171 సర్పంచి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 3,803 స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది.

# లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. "మహిళా సాధికారత కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకూడదు. రాజకీయాల్లోనూ మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి" అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురానుండటం శుభపరిణామమని అనిత పేర్కొన్నారు. "దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే నిర్ణయాల్లో మహిళలు భాగస్వాములుగా మాత్రమే కాకుండా నిర్ణయాధికారులుగా ఎదగాలి. మహిళలు మార్పులో భాగం కావాలి.. మార్పుకు మార్గదర్శకులు కావాలి" అని ఆమె ఆకాంక్షించారు. చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టమవుతుందని, కేంద్రం తీసుకుంటున్న ఈ చారిత్రక నిర్ణయం దేశవ్యాప్తంగా మహిళల్లో సరికొత్త విశ్వాసాన్ని నింపుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.ం

# జగ్గారెడ్డి ఇంటికి హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సంగారెడ్డిలోని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి నివాసానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీశ్ రావు విచ్చేశారు. జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయిరెడ్డి, కోడలు పాలక్ పటేల్ నిర్వహించిన సత్యనారాయణ వ్రతం సందర్భంగా వారిని ఆశీర్వదించేందుకు ఆయన నేరుగా జగ్గారెడ్డి ఇంటికి వెళ్లారు. ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న వీరిద్దరూ సుమారు 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించిన అనంతరం జగ్గారెడ్డి, హరీశ్ రావులు కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2004లో హరీశ్ రావు తొలిసారి మంత్రిగా ఉన్నప్పుడు తాను ఆయనను కలిసి ఆయన చాంబర్‌లోనే భోజనం చేసేవాళ్లమని గుర్తుచేశారు. ఆ తర్వాత తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు హరీశ్ రావును కలవలేదన్నారు. గత పదేళ్లు హరీశ్ మంత్రిగా, తాను ఎమ్మెల్యేగా కొనసాగినప్పటికీ ఎన్నడూ కలవలేకపోయానని తెలిపారు. కూతురి పెళ్లికి హరీశ్‌ను పిలవలేకపోయానని, అయితే ఈసారి కుమారుడి వేడుకను మిస్ కావద్దని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు జగ్గారెడ్డి చెప్పారు. తమ కలయిక వెనుక ఎలాంటి రాజకీయాలు, మతలబులు లేవని స్పష్టం చేశారు. హరీశ్ రావు బీఆర్ఎస్‌లో అగ్రనేత అని, తాను కాంగ్రెస్‌లో ఒక స్థాయి నాయకుడినని పేర్కొన్నారు. రాజకీయాలు వేరని, తాము ఎప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించుకోలేదని తెలిపారు. హరీశ్ రావు వెంట మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఉన్నారు.

# డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా తమ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఓటు వేస్తారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. డీలిమిటేషన్ అంశంపై తమ వైఖరి ఎప్పుడూ స్పష్టంగానే ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో ఎలాంటి తగ్గుదల ఉండకూడదని, తెలంగాణకు జరిగే ఏ అన్యాయాన్నీ సహించేది లేదని తేల్చిచెప్పారు. 2051 వరకు అంతర్రాష్ట్ర ప్రాతినిధ్య నిష్పత్తి మారకుండా రక్షణ కల్పించాలనేది తమ డిమాండ్ అని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల్లో సీట్లను 50 శాతం సమానంగా పెంచాలన్న తాజా ప్రతిపాదన తమ ఆందోళనలను పరిష్కరిస్తోందని తెలిపారు. ఈ సవరించిన బిల్లు ఆమోదం పొందితే తెలంగాణ లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 17 నుంచి ఏకంగా 26కు పెరుగుతుందని కేటీఆర్ వివరించారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని, దానికి నియోజకవర్గాల పునర్విభజన మార్గం సుగమం చేస్తోందని అన్నారు. కాగా, తమిళనాడులోని డీఎంకే సైతం తమ ప్రధాన డిమాండ్లను ఆమోదించినందుకుగానూ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ వెనువెంటనే బీఆర్ఎస్ కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకోవడం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆరోపణలపై రాజకీయ వర్గాల్లో కలకలం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రతిపాదనకు ఎన్సీపీ (ఎస్పీ) మద్దతు పలకడం మహారాష్ట్ర ప్రజలకు చేస్తున్న ద్రోహమని ఆయన ఆరోపించారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచే లక్ష్యంతో కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును సిద్ధం చేసింది. దీనిపై ఎంవీఏ మిత్రపక్షాలైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. అయితే, డీలిమిటేషన్ అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, శరద్ పవార్‌తో చర్చించాకే దీనికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ నేత జితేంద్ర అవ్హాడ్ పేర్కొన్నారు. మరోవైపు, అధికారిక ముసాయిదా చూసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని, అన్ని రాష్ట్రాల్లోనూ సీట్లను సమతుల్యంగా పెంచాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే తెలిపారు. ఈ పరిణామాలపై సంజయ్ రౌత్ ఘాటుగా స్పందించారు. శరద్ పవార్ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, శారీరకంగా లేదా మానసికంగా ఎలాంటి నిర్ణయం తీసుకునే స్థితిలో ఆయన లేరని వ్యాఖ్యానించారు. బిల్లుకు అనుకూలంగా ఓటు వేసేందుకు ఒక్కో ఎంపీకి రూ. 150 కోట్లు ఆఫర్ చేస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. కాగా, గత రాజ్యసభ ఎన్నికల్లో తమ మద్దతుతోనే పవార్ గెలిచారని మహారాష్ట్ర కాంగ్రెస్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ విభేదాల క్రమంలోనే ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన ఇండియా కూటమి ఫ్లోర్ లీడర్ల సమావేశానికి ఎన్సీపీ (ఎస్పీ) నేతలు హాజరుకాలేదు. ఈ పరిణామాలు విపక్ష కూటమి భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరలేపాయి.

# పోలింగ్ కేంద్రాల వద్ద 150 మంది బందోబస్తు

## మండలంలో 400 పైగా బైండోవర్ కేసులు

## నాయకులు అధికారులకు సహకరించాలి..

## ఎస్ఐ ఎల్.శివాంజల్.



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలో రెండవ విడత జరిగే పంచాయితీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద 150 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎల్.శివాంజల్ పేర్కొన్నారు. శనివారం మహానంది పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడారు... మండలంలోని 13 పంచాయతీలలో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు. పోలింగు కేంద్రాల వద్ద గుంపులుగా ఉండొద్దన్నారు.ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.ముఖ్యంగా యువత ఎన్నికల్లో ప్రభోవాలకి,ఉద్రుక్తలకి లోనై దాడులు, దిగితే కేసులు నమోదు అవుతాయన్నారు. ఒక్కసారి కేసు నమోదు అయితే భవిష్యత్ అంధకారం అవుతుందని హెచ్చరించారు.మండలంలో ఇప్పటివరకు 400 పైగా బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు.ఎక్కడైనా ఎవరైనా పోలింగ్ బూత్ల వద్ద ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవన్నారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని పార్టీ నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు.

# మాజీ సర్పంచ్ సేవలు చిరస్మరణీయం.

## కైరుప్పల నూతన సర్పంచ్ రూప ఘన నివాళి.

ఆస్పరి (పల్లె వెలుగు): ఆలూరు తాలూకా ఆస్పరి మండలం కైరుప్పల గ్రామ నూతన సర్పంచ్గా ఎన్నికైన కైరుప్పల రూప (భర్త వరప్రసాద్ బాబు) గ్రామ మాజీ సర్పంచ్ కీర్తి శేషులు జీకే వీరభద్రకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీకే వీరభద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నూతన సర్పంచ్ రూప, గ్రామానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మాజీ సర్పంచ్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన సర్పంచ్ రూప తెలిపారు. ఈ కార్యక్రమంలో జీ.కే వీరభద్రి కుమారుడు డాక్టర్ జీ.కే వీరేష్ మరియు గ్రామ నాయకులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### ఫరూక్ సార్ ఆశీస్సులు, తనయులు ఫిరోజ్, ఫయాజ్ అండదండలు, బాల అకాడమీ పెద్దల ప్రోత్సాహంతో గుంతనాల సర్పంచ్గా కానాల సుదర్శనం ఘన విజయం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గుంతనాల గ్రామం నుండి తెలుగుదేశం పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన



కాణాల సుదర్శనం ఘన విజయం సాధించి గ్రామ సర్పంచ్గా ఎన్నికయ్యారు.
ఈ విజయానికి ప్రముఖ టీడీపీ నాయకులు ఫరూక్ సార్ అందించిన ఆశీస్సులు, వారి తనయులైన ఫిరోజ్ , ఫయాజ్ అందించిన అండదండలు, సహాయ సహకారాలు ఎంతగానో తోడ్పడ్డాయి. అదేవిధంగా బాల అకాడమీ వ్యవస్థాపకులు కొండయ్య , వారి తనయుడు ఎం.జి.ఎఫ్. లయన్ రవీంద్రనాథ్ అందించిన ప్రోత్సాహం, సహాయ సహకారాలు కూడా ఆయన విజయానికి మరింత బలాన్ని చేకూర్చాయి.
ఈ సందర్భంగా నూతన సర్పంచ్ కాణాల సుదర్శనం కి పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్య తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గుంతనాల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.
ప్రజల ఆదరణతో సాధించిన ఈ విజయాన్ని గ్రామ అభివృద్ధికి అంకితం చేస్తూ, ప్రజాసేవలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని నూతన సర్పంచ్ కాణాల సుదర్శనం కి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి భక్తుల విరాళం



బనగానపల్లె , నవంబర్ 28, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి అనంతపురం పట్టణంలోని ఎస్ వి రెసిడెన్సి కి చెందిన కూచి మల్లికార్జున, ఆయన సతీమణి సుగుణమ్మ, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ"25,000/- ల చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు శనివారంఅందచేశారు

# నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఒక చారిత్రాత్మక నిర్ణయం

**☛కేంద్ర కేబినెట్ ఆమోదాన్ని స్వాగతించిన ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ**

**☛మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు ఇది గొప్ప ముందడుగు అని హర్షం**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం దేశ రాజకీయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని, ఇది అత్యంత చారిత్రాత్మక నిర్ణయమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఈ సాహసోపేత నిర్ణయాన్ని యావత్ మహిళా లోకం తరఫున, విశ్వబ్రాహ్మణ సమాజం తరఫున హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ బిల్లు ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రజాప్రాతినిధ్యం మరింత బలోపేతం కానుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.
బిల్లులోని ప్రధాన ముఖ్యాంశాలను ఆమె ఈ సందర్భంగా వివరించారు:
ఏపీ అసెంబ్లీ స్థానాలు పెంపు: రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 263కు పెరగనుంది. దీనివల్ల రాష్ట్రానికి అదనంగా 88 కొత్త అసెంబ్లీ స్థానాలు అందుబాటులోకి వస్తాయి. లోక్సభ స్థానాల వృద్ధి: ఆంధ్రప్రదేశ్లో లోక్సభ స్థానాల సంఖ్య 25 నుంచి 37 లేదా 38కి పెరిగే అవకాశం ఉంది. అలాగే దేశవ్యాప్తంగా



లోక్సభ స్థానాలు 543 నుంచి 850కి పెరగనున్నాయి.
మహిళా సాధికారత & సామాజిక న్యాయం: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుతో దాదాపు 270 స్థానాలు మహిళలకు దక్కనున్నాయి. ఇది మహిళా సాధికారతకు పెద్ద ముందడుగు. అదనంగా పెరగనున్న ఎస్సీ, ఎస్టీ స్థానాల వల్ల సామాజిక న్యాయం మరింత బలపడుతుంది.
మంత్రివర్గ విస్తరణ: నియోజకవర్గాల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో మంత్రివర్గ కోటా 26 నుంచి 39కి చేరనుంది.
ప్రజలకు చేరువగా పాలన: 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన జరిగే ఈ పునర్విభజన వల్ల, ఒక్కో శాసనసభ స్థానం పరిధిలో సగటు ఓటర్ల సంఖ్య 1.60 లక్షలుగా ఉండనుంది. తద్వారా ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం కలుగుతుంది.
కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు మహిళలకు, బడుగు బలహీన వర్గాలకు, ముఖ్యంగా విశ్వబ్రాహ్మణులతో సహా అన్ని సామాజిక వర్గాలకు రాజకీయ అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని కమ్మరి పార్వతమ్మ ధీమా వ్యక్తం చేశారు. ఈ బిల్లు త్వరలోనే పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొంది, చట్ట రూపం దాల్చాలని ఆమె ఆకాంక్షించారు.

## హెచ్ఐవి బాలల కోసం పౌష్టికాహార ప్యాకెట్లు

# అందజేసిన రామ్ మోహన్ రావు.

**☛ఎస్ ఎస్ వి రామ్మోహన్ రావు15 సంవత్సరాలుగా ప్రతి నెల 300 కేజీల పౌష్టికాహార ప్యాకెట్ల వితరణ.**

**☛రామ్ మోహన్ రావు ను ఘనంగా సత్కరించిన నంద్యాల లయన్స్ క్లబ్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో , నెల్లూరు ప్రతిభ లయన్స్ క్లబ్ కు చెందిన ఎస్.ఎస్.వి. రామ్మోహన్ రావు హెచ్ఐవి బాలలకు పంపిణీ చేయడం కోసం తొమ్మిది రకాల పోషకాహార విలువలు కలిగిన సరకులతో రూపొందించిన పౌష్టికాహార పౌడర్ నూరు ప్యాకెట్లు నంద్యాల లయన్స్ క్లబ్ కు అందజేశారు.
ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ లయన్స్ కౌన్సిల్ మాజీ చైర్మన్
ఏ.వి.ఆర్. ప్రసాద్ లు మాట్లాడుతూ రామ్ మోహన్ రావు గత 15 సంవత్సరాలుగా ప్రతినెల 300 కేజీల పౌష్టికాహార పౌడర్ ప్యాకెట్లు తయారు చేయించి వివిధ ప్రాంతాలలో హెచ్ఐవి, క్యాన్సర్ తదితర బాధితులకు అందజేస్తూ విశిష్ట సేవలు ఘనంగా సత్కరించారు.



అందిస్తున్నారని ప్రశంసించారు.
రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఈ పౌష్టికాహార పౌడర్ వ్యాధిని తగ్గించే ఔషధం కాదని,వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి దోహదం చేస్తుందని అన్నారు. తొమ్మిది రకాల పోషకాహార సరకులతో ఈ పౌష్టికాహార పొడిని స్వచ్ఛత ప్రమాణాలు పాటిస్తూ తయారుచేసి అందిస్తున్నామని అన్నారు.
ఈ సందర్భంగా రామ్ మోహన్ రావును నంద్యాల లయన్స్ క్లబ్ శాలువా, జ్ఞాపిక లతో
ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్,లయన్స్ జిల్లా మెంబర్ షిప్ చైర్మన్ రవి ప్రకాష్, రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్, లయన్స్ జిల్లా పి.ఆర్.ఓ. సుధాకర్ రెడ్డి, సీనియర్ సభ్య లు ఆంజనేయులు గుప్తా, డాక్టర్ సహదేవుడు, భవనాసి నాగ మహేష్ అధిక సంఖ్యలో నంద్యాల లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# నాగలక్ష్మి మృతితో భగ్గుమన్న వైసీపీ శ్రేణులు

**--కర్నూలు అమృత ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులతో వాగ్వాదం**

**--సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**--మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐకి ఫిర్యాదు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో అహోబిలంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఘర్షణలో తీవ్రంగా గాయపడి కర్నూలులోని అమృత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగలక్ష్మి మృతి చెందడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆమె మృతిపై వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.
ఘటన నేపథ్యమిదీ..
అహోబిలంలో జరిగిన పోలింగ్ సందర్భంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బూత్లోకి వెళ్లి రిగ్గింగ్కు పాల్పడ్డారంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగినట్లు వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాట, కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న నాగలక్ష్మి కర్నూలు అమృత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు.

### ఆసుపత్రి వద్ద ఆందోళన.. పోలీసుల జోక్యం



దీంతో ఆసుపత్రి ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత నాగలక్ష్మి మరణవార్త తెలియగానే వైఎస్సార్సీపీ నాయకులు, మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. అయితే, ఈ ఘటనను పోలీసులు సహజ మరణంగా చిత్రీకరిస్తూ మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించడంపై వైసీపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.
"నాగలక్ష్మి మృతికి గల వాస్తవ కారణాలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలి. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు మృతదేహాన్ని కదలనివ్వం"
--- ఆందోళనలో వైఎస్సార్సీపీ నాయకులు
నెలకొంది. అనంతరం పోలీసులు ఆందోళనకారులకు సర్దిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.
పోలీసులకు ఫిర్యాదు
ఆసుపత్రి వద్ద ఆందోళన అనంతరం వైఎస్సార్సీపీ నాయకులు కర్నూలు మూడో పట్టణ పోలీస్ స్టేషన్కు చేరుకున్నారు. అక్కడ ఉన్న ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐని కలిసి ఘటనపై లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ కేసును పారదర్శకంగా విచారించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఆర్జియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా 12వ వార్షిక క్రీడా దినోత్సవం.

**--404 పాయింట్లతో "మహిమ" హౌస్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. విద్యార్థుల



క్రీడాస్ఫూర్తి,క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా ఆర్జియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో 12వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఒలింపిక్ టార్చ్ వెలిగించి ప్రిన్సిపల్ శ్రీమతి గాయత్రి క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు.క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ,పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని అలవర్చుతాయని తెలిపారు.గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ,తమకు ఆసక్తి ఉన్న



రంగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

క్రీడా పోటీల్లో భాగంగా విద్యార్థులను అక్షయ,మహిమ, ఉజ్వల,సాధన పేర్లతో నాలుగు హౌస్‌లుగా విభజించారు.వివిధ అథ్లెటిక్స్,గ్రూప్ గేమ్స్ నిర్వహించారు.నాలుగు హౌస్‌ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు.అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన "మహిమ" హౌస్ 404 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

అనంతరం విజేతలకు ప్రిన్సిపల్ గాయత్రి ట్రోఫీలు,మెడల్స్,ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల




యాజమాన్యం,ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలం లో రంగారావు జన్మదిన సందర్భంగా

# 600 మందికి అన్నప్రసాద వితరణ

**రుద్రవరం.అహోబిలం లో రంగారావు జన్మదిన సందర్భంగా 600 మందికి అన్నప్రసాద వితరణ**

రుద్రవరం.అహోబిలం.పల్లె వెలుగు : అహోబిలం





పుణ్యక్షేత్రంలో గురువుగారైన రంగారావు గారి జన్మదినాన్ని పురస్కరించుకొని రంగారావు గోష్టి తరఫున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ కిడాంబి వేణుగోపాలాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్తీక మాసం శనివారం కావడంతో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏ.డి. శ్రీ రవికాంత్ చౌదరి , దేవస్థానం ఫోటోగ్రాఫర్ ఉప్పల ప్రసాదు, అడ్వకేట్ శ్రీ నరేంద్ర , శ్రీ త్రిలోక్ , ఎలక్ట్రికల్ సిబ్బంది శ్రీ ఎన్. వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, అంజి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.: అహోబిలం పుణ్యక్షేత్రంలో గురువుగారైన రంగారావు గారి జన్మదినాన్ని పురస్కరించుకొని రంగారావు గోష్టి తరఫున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని అహోబిలం దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ కిడాంబి వేణుగోపాలాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 600 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్తీక మాసం శనివారం కావడంతో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏ.డి. శ్రీ రవికాంత్ చౌదరి , దేవస్థానం ఫోటోగ్రాఫర్ ఉప్పల ప్రసాదు, అడ్వకేట్ శ్రీ నరేంద్ర , శ్రీ త్రిలోక్ , ఎలక్ట్రికల్ సిబ్బంది శ్రీ ఎన్. వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, అంజి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రెండో విడత పల్లెపోరుకు సర్వం సిద్ధం

**బనగానపల్లె మండలంలో 12 పంచాయతీలు, 118 వార్డులకు నేడే పోలింగ్**

**బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్న 25,070 మంది ఓటర్లు**

**సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా, భారీ పోలీసు బందోబస్తు**

**మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్.. సాయంత్రానికే ఫలితాల వెల్లడి**

బనగానపల్లె, నవంబర్ 28, పల్లెవెలుగు



బనగానపల్లె మండలంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయతీలకు గాను ఇప్పటికే 12 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 12 గ్రామ పంచాయతీలు, 118 వార్డు సభ్యుల స్థానాలకు ఆదివారం (నవంబర్ 29) పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు:లి

మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయం నుంచి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు మరియు ఇతర ఎన్నికల సామగ్రిని పటిష్టమైన పోలీసు భద్రత మధ్య సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సిబ్బంది, సామగ్రి రవాణా కోసం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలను వినియోగించారు.

1997,వెంకటాపురంలో 1674, టంగుటూరులో 2864, తిమ్మాపురంలో 1702 మంది చెర్వుపల్లెలో 2038 మంది మొత్తం 25070 మంది ఓటర్లున్నారు.

మొత్తం 25,070 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.7

**గట్టి నిఘా.. భారీ బందోబస్తు:**

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాల





**ఈ గ్రామ పంచాయతీలో పోలింగ్**

నిఘాతో పాటు అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి వార్డులు, పంచాయతీల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టి, సాయంత్రానికే విజేతల వివరాలను ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు.

# అపరిశుభ్రతపై కమిషనర్ ఆగ్రహం

**- ముగ్గురు వాణిజ్య దుకాణాల నిర్వాహకులకు జరిమానా**

**- నిబంధనలు పాటించకుంటే ట్రేడ్ లైసెన్సుల రద్దు, దుకాణాల సీజ్**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : నగరంలోని బాలాజీ నగర్‌లో జాతీయ రహదారిని



ఆనుకుని ఉన్న వాణిజ్య దుకాణాల వద్ద అపరిశుభ్రత, డ్రైనేజీ సమస్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎన్ఆర్ పేట, సుంకేసుల రోడ్డు, బాలాజీ నగర్, మహాలక్ష్మి నగర్, బి.క్యాంపు, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. బాలాజీ నగర్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు డ్రైనేజీ బ్లాక్ కావడంపై సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ పరిశుభ్రత పాటించని శివా వైన్స్, రిహాన్ కాజు చికెన్ పకోడా, జమ్ జమ్ కూల్‌డ్రింక్స్ దుకాణాల నిర్వాహకులకు భారీ జరిమానాలు విధించాలని, అయినప్పటికీ నిబంధనలు పాటించకపోతే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇంస్పెక్టర్లు ఫరుక్, హుస్సేన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ వార్డు కార్యాలయాల ఆకస్మిక తనిఖీ

**- సిబ్బంది హాజరు, ప్రజాసేవలపై అదనపు కమిషనర్ సమీక్ష**

**- ఆధార్, ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలోని 125, 126, 127, 128వ స్వర్ణ వార్డు కార్యాలయాలను అదనపు కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో సమీక్షించారు. సిబ్బంది హాజరు పట్టికలు, సమయపాలనను పరిశీలించి విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆన్‌లైన్ సేవల వేగం, పన్నుల వసూళ్ల ప్రగతిని సమీక్షించారు. కార్యాలయాల పరిసరాలను



పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఆధార్ నవీకరణ, ఈ-కేవైసీ ప్రక్రియతో పాటు ఆధార్ లేని చిన్నారుల నమోదు కార్యక్రమాన్ని రోజువారీ లక్ష్యాలతో నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని స్వర్ణ వార్డు సిబ్బందికి సూచించారు. అనంతరం ఎన్.ఆర్. పేటలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు తప్పనిసరి జీవముద్ర నవీకరణ, ప్రత్యేక ఆధార్ శిబిరాల ఏర్పాటుపై పాఠశాల యాజమాన్యంతో చర్చించారు. శిబిరాల నిర్వహణకు సిబ్బందికి పూర్తి సహకారం అందించి, విద్యార్థుల పెండింగ్ జీవముద్ర నవీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి- మంత్రి బీసీ



బనగానపల్లె, నవంబర్ 28, పల్లెవెలుగు కూటమి అభ్యర్థులను ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రెండో విడతలో నేడు జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పల్లెల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.ఐదేళ్లు అరాచక పాలన సాగించిన వైసీపీకి పంచాయతీ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో పూర్తి పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు తమ ఓటు ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన మద్దతును రెండో విడతలోనూ కొనసాగించాలని మంత్రి కోరారు. అరాచక పాలనకు, అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే ప్రజా పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ప్రజల ఆశీస్సులతో ఏకపక్ష విజయాలు సాధిస్తారని మంత్రి బీసీ ధీమా వ్యక్తం చేశారు. తొలిదశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి, అభివృద్ధి పాలనకు లభించిన స్పష్టమైన మద్దతుకు నిదర్శనమన్నారు. ఏకగ్రీవాలతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 68.75 శాతం పంచాయతీలను కూటమి మద్దతుదారులు కైవసం చేసుకోవడం, 2,715 సర్పంచి స్థానాల్లో విజయం సాధించడం ప్రజలు కూటమి పాలనను మనస్ఫూర్తిగా ఆదరిస్తున్నారనే విషయాన్ని చాటుతోందన్నారు. ఈ ఫలితాలు కేవలం ఎన్నికల విజయాలు మాత్రమే కాదని, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు అని తెలిపారు.

# మహానంది మండలంలో పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలో రెండో విడత 13 గ్రామ పంచాయతీలలో




జరిగే సర్పంచ్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. నేడు ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.మండలంలో 140 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. మధ్యాహ్నం 1 గంట ఒకటి వరకు పోలింగ్ 3 మూడు గంటల నుంచి కౌంటింగ్ జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 30,176 మంది ఓటర్లు ఉన్నారు.వారిలో పురుషులు 14,695 మంది కాగా మహిళా ఓటర్లు 15,471, ఇతరులు 10 మంది ఉన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

బనగానపల్లె, నవంబర్ 28, పల్లెవెలుగు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని




ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమీల పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన వ్యవహారాలు , క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ కార్యక్రమంలో నషా ముక్త్ యువ -- మత్తు పదార్థాల రహిత సమాజమే లక్ష్యం
2026--27 సంవత్సరానికి సంబంధించి నెయిబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూయువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావాల గురించి వివరించారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలు, సమాజం పట్ల సేవాభావం పెంపొందించడమే యూత్ పార్లమెంట్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపాశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.నేటి యువత రేపటి భారత భవిష్యత్తు అని, యువత మత్తుకు దూరంగా ఉండి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బనగానపల్లె అర్బన్ ఏ ఎస్ ఐ గుండెపోటు తో మృతి నివాళులు అర్పించిన బనగానపల్లె సర్పంచ్ బీసీ ఇందిరా రెడ్డి



బనగానపల్లె, నవంబర్ 28,పల్లెవెలుగు ప్యాపిలి మండలం ఎన్.రంగాపురం గ్రామానికి చెందిన బనగానపల్లె అర్బన్ ఏ ఎస్ ఐ జె . సుబ్బా రెడ్డి గుండెపోటుతో మృతి చెందారనే విషయం తెలుసుకున్న బనగానపల్లె సర్పంచ్ బీసీ ఇందిరా రెడ్డి వారి స్వగృహానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ లు, ఎస్ఐ లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బాలి రెడ్డికి టీడీపీలో కీలక పదవి కల్పించాలి.



కొలిమిగుండ్ల మండలంలో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడికి సముచిత గుర్తింపు ఇవ్వాలని ఇటిక్యాల గ్రామ ప్రజల విజ్ఞప్తి. మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బాలి రెడ్డికి పార్టీలో కీలక పదవి కేటాయించాలని గ్రామ ప్రజలు పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.సుమారు 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన బాలి రెడ్డి గ్రామ ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలో ఫ్యాక్టరీలు, పరిశ్రమల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తూ పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడ్డారని తెలిపారు. దీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తూ, ప్రజల ఆదరాభిమానాలు పొందిన బాలి రెడ్డి వంటి సీనియర్ నాయకుడికి తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనేపథ్యంలో కొలిమిగుండ్ల మండలంలో తెలుగుదేశం పార్టీ తరఫున కీలక బాధ్యతలు అప్పగించి ఆయన సేవలను వినియోగించుకోవాలని పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నారాయణ, పెద్ద గోవిందమ్మ, చిన్న గోవిందమ్మ, దస్తగిరమ్మ, లక్ష్మీదేవి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


# చెరువుపల్లె సర్పంచ్ అభ్యర్థిని స్టేషన్ తరలించిన పోలీసులు

**-- స్టేషన్ ముందు ధర్నా నిర్వహించిన వైసీపీ కార్యకర్తలు**

బనగానపల్లె , నవంబర్ 28, పల్లెవెలుగు



మండలంలోని చెరువు పల్లె గ్రామ పంచాయతీకి సర్పంచుగా వైసిపి మద్దతుతో పోటీ చేస్తున్న ఇటిక్యాల చిన్న పుల్లయ్యను పోలీసులు నందివర్గం పోలీస్ స్టేషన్ కు తరలించారు . ఆదివారం చెరువు పల్లె గ్రామ పంచాయతీకి సర్పంచుగా వైసిపి మద్దతుతో పోటీ చేస్తున్న ఇటిక్యాల చిన్న పుల్లయ్యను పోలీసులు స్టేషన్ కు తరలించడంతో నందివర్గం పోలీస్ స్టేషన్ ముందు వైసిపి నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు వైసీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఇటిక్యాల చిన్నపుల్లయ్యను ఆక్రమంగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని వదిలి పెట్టేంత వరకు ధర్నా విరమించే ప్రసక్తే లేదని వైసిపి నాయకులు కార్యకర్తలు తెలిపారు. సమాచారాన్ని తెలుసుకొని నందివర్గం పోలీస్ స్టేషన్ కు తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మధ్యలోనే నందవరం వద్ద పోలీసులు అడ్డుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నందవరం లో స్టే చేయడంతో ఇటిక్యాల చిన్న పుల్లయ్యను నాటకీయ పరిణామాల మధ్య పోలీసులు విడుదల చేశారు.




పుల్లయ్యను అక్రమంగా అరెస్టు చేయడం దారుణం- మాజీ ఎమ్మెల్యే కాటసాని వైసీపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇటిక్యాల చిన్న పుల్లయ్యను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా టిడిపి నాయకులు ఎన్నికలను ఎదుర్కోలేక అక్రమ మార్గాల్లో గెలిచేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో టిడిపి నాయకులు గెలవాలని చూస్తున్నారని విమర్శించారు.పోలింగ్ రోజు దొంగ ఓట్లు వేయడానికి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు పన్నాగం పన్నుతున్నారని,కారంపొడి పెట్టుకొని దొంగ ఓట్లను నివారించాలన్నారు.

# రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం.

**--11 మండలాల్లో 123 గ్రామపంచాయతీలు, 1,982 వార్డులకు పోలింగ్.**

**--2,108 పోలింగ్ గదుల ఏర్పాటు. ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు.**

**--జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. రెండవ విడతలో భాగంగా 11 మండలాల పరిధిలోని 123 గ్రామపంచాయతీలు, 1,982 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం 123 పోలింగ్ కేంద్రాల లొకేషన్ల పరిధిలో 2,108 పోలింగ్ గదులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు రెండవ విడత ఎన్నికలు జరగనున్న 11 మండలాల్లో మొత్తం 195 గ్రామపంచాయతీలు ఉండగా, ఇప్పటికే 72 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 123 గ్రామపంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.

**మండలాల వారీగా ఎన్నికల ఏర్పాట్లు ఇలా..**

బనగానపల్లి: 12 గ్రామపంచాయతీలు, 124 వార్డులు, 37 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 44 సమస్యాత్మక, 10 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. కోవెలకుంట్ల: 10 గ్రామపంచాయతీలు, 100 వార్డులు, 21 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 50 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు.కొలిమిగుండ్ల: 7 గ్రామపంచాయతీలు, 72 వార్డులు, 16 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 14 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. అవుకు: 21 గ్రామపంచాయతీలు, 200 వార్డులు, 40 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 10 సమస్యాత్మక, 2 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. సంజామల: 5 గ్రామపంచాయతీలు, 54 వార్డులు, 8 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 12 సమస్యాత్మక, 6 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. వెలుగోడు: 5 గ్రామపంచాయతీలు, 58 వార్డులు, 14 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 6 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. మహానంది: 13 గ్రామపంచాయతీలు, 140 వార్డులు, 28 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 30 సమస్యాత్మక, 25 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. ఆత్మకూరు: 14 గ్రామపంచాయతీలు, 130 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 30 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. బండి ఆత్మకూరు: 19 గ్రామపంచాయతీలు, 192 వార్డులు, 26 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 77 సమస్యాత్మక, 29 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. గడివేముల: 15 గ్రామపంచాయతీలు, 154 వార్డులు, 27 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 24 సమస్యాత్మక, 16 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు. పాణ్యం: 19 గ్రామపంచాయతీలు, 190 వార్డులు, 27 పోలింగ్ కేంద్రాల లొకేషన్లు. 34 సమస్యాత్మక, 26 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు.



ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, పటిష్ట పోలీసు బందోబస్తు, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలతో పాటు ఎన్నికల సామగ్రి, సిబ్బంది నియామకాలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అధికారులు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల ఫేజ్-3 శిక్షణకు గైర్హాజరైన 310 మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు.

**--ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు (పి ఓ)గా నియమితులైనప్పటికీ, ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరైన 310 మంది ఉద్యోగులపై ఎన్నికల నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ జి. రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు**

మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల కోసం నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించిన శిక్షణ తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని ముందస్తుగా ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

**310 మంది ఉద్యోగులు గైర్హాజరు**

ప్యాపిలి, డోన్, నందికొట్కూరు, జూపాడుబంగ్లా,



పాములపాడు, కొత్తపల్లి, పగిడ్యాల, మిడ్తూరు తదితర మండలాలకు చెందిన మొత్తం 310 మంది ఉద్యోగులు శిక్షణ తరగతులకు హాజరుకాలేదని కలెక్టర్ పేర్కొన్నారు.

**ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు**

ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణకు గైర్హాజరు కావడం బాధ్యతారాహిత్యమే కాకుండా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

**షోకాజ్ నోటీసులు జారీకి ఆదేశాలు**

శిక్షణకు గైర్హాజరైన 310 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణలను పరిశీలించిన అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల విధులు ప్రభుత్వ ఉద్యోగులందరికీ తప్పనిసరి బాధ్యత అని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి జారీ చేసే ఆదేశాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, విధుల పట్ల అలసత్వం వహించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎమ్మెల్యేను కలిసిన నూతనంగా ఎన్నికైన సర్పంచులు - టిడిపి నాయకులు

రుద్రవరం.పల్లె వెలుగు : మండల పరిధిలోని పలు ముళ్ళ హసీనా, చిన్నకంబలూరు జంగా నాగరాణమ్మ, పెద్దకంబలూరు పగడాల శివమ్మ, డి కొట్టాల భూమిరెడ్డి వరలక్ష్మి, బీరవోలు కూడాల సుశీలమ్మ, కొండమాయపల్లె బండారు ఆదిలక్ష్మి దేవి, చందలూరు పుటికె వెంకటలక్షమ్మ, మందలూరు బండి వీరభద్రుడు, ముత్తలూరు నంద్యాల సూర్యనారాయణ రెడ్డి, ఆలమూరు శెట్టి వేణుగోపాల్, హరినగరం పెనుగొండ సుబ్బరాయుడు గ్రామ పంచాయతీలలో టిడిపి మద్దతుతో పోటీచేసిన అభ్యర్థులు గ్రామ ప్రజల ఆశీర్వాదంతో పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించారు. నూతనంగా సర్పంచులుగా ఎన్నికైన



గ్రామాలలో టిడిపి మద్దతుతో ఎన్నికైన సర్పంచులు టిడిపి నాయకులు, ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ ను మర్యాదపూర్వకంగా కలిశారు. రుద్రవరం మండలంలో చిలకలూరు అనంతరం ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలలతో సన్మానించి తమ గెలుపుకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన సర్పంచులుగా ఎన్నికైన అభ్యర్థులను ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామాలలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాలని అలాగే ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పాలన అందించాలని ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని, నాయకులతో కలిసికట్టుగా గ్రామానికి ప్రజలకు సంబంధించిన ప్రతి పనిని తక్షణమే నెరవేర్చేలా కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన సర్పంచులకు తెలియజేశారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

**-సమానత్వం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం కోసం పాటుపడాలి.**

ఆదోని (పల్లె వెలుగు): సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యువనేత జయ మనోజ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షుడు బి. దేవాపిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



సమాజంలో అంటరానితనం, కులవివక్ష తీవ్రంగా ఉన్న సమయంలోనే బడుగు, బలహీన వర్గాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే విశేషంగా కృషి చేశారని కొనియాడారు. మహిళలకు విద్య ద్వారానే ఆత్మగౌరవం, సమాన హక్కులు సాధ్యమని విశ్వసించి తన భార్య సావిత్రిబాయి పూలేను విద్యావంతురాలిగా తీర్చిదిద్ది, మహిళా విద్యకు బాటలు వేశారని గుర్తుచేశారు.

సావిత్రిబాయి పూలే ద్వారా మహిళలకు విద్యను అందించడంతో పాటు అణగారిన వర్గాల్లో విద్యా చైతన్యం తీసుకురావడానికి జ్యోతిరావు పూలే చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన త్యాగాలు, సామాజిక సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, హరి, జయరాం, వీరాంజి, కుప్పయ్య, చిన్న వీరప్ప, ఇర్ఫాన్ భాష, సాంబ, గంగాధర్, సుధాకర్, రంగస్వామి, ఏసోబు, గోవిందు, లక్ష్మన్న, నల్లారెడ్డి, మాలిక్ భాష తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు రాజకీయం. నంద్యాలలో భగ్గుమన్న ప్రజాగ్రహం.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నమ్మించి ఇంటి వద్ద భారీ ధర్నాకు దిగారు. "నమ్మకద్రోహి




నట్టేట ముంచిన 32వ వార్డు కౌన్సిలర్ ఎద్దు రోజమ్మపై నిప్పులు చెరిగిన వార్డు ప్రజలు వైసీపీ శ్రేణులు తక్షణమే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలని ఇంటి ముందు భారీ ధర్నా నిర్వహించారు . విలేకరుల ప్రశ్నలకు రోజమ్మ భర్త ఎద్దు రవికుమార్ తడబడపడి పడ్డారు.

నంద్యాల మున్సిపల్ రాజకీయాల్లో పెను సంచలనం రేపిన 'వెన్నుపోటు' వ్యవహారం ఇప్పుడు ప్రజాగ్రహంగా మారింది. అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలను, నమ్మి బీ-ఫామ్ ఇచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నట్టేట ముంచి, కీలకమైన వైస్ చైర్మన్ ఎన్నికకు గైర్హాజరైన 32వ వార్డు కౌన్సిలర్ ఎద్దు రోజమ్మ తీరుపై స్థానిక ప్రజలు, వైసీపీ శ్రేణులు భగ్గుమన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని 32వ వార్డుకు తిరిగి వచ్చిన ఎద్దు రోజమ్మ, ఆమె భర్త ఎద్దు రవికుమార్‌లను నిలదీస్తూ స్థానికులు, వైసీపీ నాయకులు వారి రోజమ్మ డౌన్ డౌన్.. తక్షణమే రాజీనామా చేయాలి" అంటూ నినాదాలతో వార్డు దద్దరిల్లింది.

అసలేం జరిగింది? కీలక సమయంలో అదృశ్యం!ఇటీవల జరిగిన నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 27 వార్డులను కైవసం చేసుకుని సత్తా చాటింది. ఈ నెల 23న మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. సభలో కూటమికి 28, వైసీపీకి 28 ఓట్ల సమాన బలం ఉండటంతో వైస్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందన్న ఉత్కంఠ రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది. సరిగ్గా ఇదే కీలక సమయంలో 32వ వార్డు వైసీపీ కౌన్సిలర్ ఎద్దు రోజమ్మ సమావేశానికి గైర్హాజరై సొంత పార్టీకే ఊహించని షాక్ ఇచ్చారు. ఈ నెల 21 నుంచే ఎద్దు రోజమ్మ, ఆమె ఎద్దు భర్త రవికుమార్ కుటుంబ సభ్యులతో సహా నంద్యాల విడిచి అజ్ఞాతంలోకి వెళ్లడం తీవ్ర అనుమానాలకు తావిచ్చింది. ఫలితంగా వైసీపీకి రావాల్సిన వైస్ చైర్మన్ పదవి కూటమి ఖాతాలోకి వెళ్లిపోయింది.

నిలదీసిన జనం.. నీళ్లు నమిలిన రవికుమార్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నేడు గుట్టుచప్పుడు కాకుండా ఇంటికి చేరుకున్న ఎద్దు రోజమ్మ దంపతులను చూసి స్థానిక వార్డు ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వైసీపీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న విలేకరులు "కీలక ఎన్నికకు ఎందుకు రాలేదు? ఎక్కడికి వెళ్లారు?" అని అడిగిన ప్రశ్నలకు రోజమ్మ భర్త ఎద్దు రవికుమార్ పొంతనలేని సమాధానాలు ఇస్తూ నీళ్లు నమలడం అందరినీ విస్మయానికి గురిచేసింది.అభివృద్ధిని అడ్డుకునే కుట్ర: వైసీపీ నేతలు ఈ సందర్భంగా నిరసనకు నాయకత్వం వహించిన వైసీపీ నేతలు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. "మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కృషి, పార్టీ జెండా బలంతో గెలిచిన రోజమ్మ పదవి కోసం పార్టీకి, 32వ వార్డు ప్రజలకు తీరని ద్రోహం చేశారు. సొంత పార్టీ గుండెల్లో పొడిచిన ఈ వెన్నుపోటును చరిత్ర క్షమించదు. నైతికత ఉంటే తక్షణమే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసి, దమ్ముంటే మళ్లీ ఎన్నికలకు రావాలి" అని సవాల్ విసిరారు. వెంటనే ఎద్దు రవి పోలీసుల సహకారంతో బైక్ పై పారిపోవడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు మనోజ్ కుమార్, కారు రవికుమార్, దేవనగర్ బాష, మేకల శేఖర్, ప్రవీణ్, కన్న, కిరణ్ కుమార్, డెన్నీలతో పాటు పెద్ద సంఖ్యలో 32వ వార్డు మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.

# మల్లప్పన్నపై అసత్య ప్రచారాలు చేస్తే ప్రజలు సహించరు.

**రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలి -- జనసేన నాయకుడు పులి రాజు.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మల్లప్పన్నపై కొందరు చేస్తున్న అసత్య, నిరాధార ప్రచారాలను జనసేన పార్టీ నాయకుడు ఎం. పులి రాజు తీవ్రంగా ఖండించారు. వాస్తవాలు తెలుసుకోకుండా వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పులి రాజు మాట్లాడుతూ.. ఆదోని రాజకీయ చరిత్రలో మల్లప్పన్న తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో ఆయనకు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు వ్యక్తులు నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని




విమర్శించారు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే విమర్శలు వాస్తవాలు, ఆధారాలపై ఉండాలని సూచించారు. రాజకీయంగా విమర్శించాలే తప్ప వ్యక్తిగతంగా బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. మల్లప్పన్నపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఆయన గౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేస్తారని పులి రాజు హెచ్చరించారు. అసత్య ప్రచారాలతో ప్రజల్లో మల్లప్పన్నకు ఉన్న ఆదరణను తగ్గించలేరని అన్నారు. ఇకనైనా వ్యక్తిగత ఆరోపణలు, అసత్య ప్రచారాలకు స్వస్తి పలికి వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని పులి రాజు హితవు పలికారు.

# ఇంద్ర బస్సు సర్వీసులపై 10 శాతం టికెట్ రాయితీ



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 28 . (పల్లె వెలుగు ): నంద్యాల డిపో మేనేజర్ ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ నంద్యాల డిపో నుండి హైదరాబాద్ బిహెచ్ఎల్ ఇంద్ర ఏసి సర్వీసు నెంబరులు 6413 , 6418 . మరియు నంద్యాల నుండి బెంగళూరు ఇంద్ర ఏసి సర్వీసు నెంబరులు 51500 , 51501 . ఇంద్ర ఏసి బస్సుల్లో టికెట్ పై 10 శాతం ప్రత్యేక రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు నంద్యాల డిపో మేనేజర్ జే ఎమాధవీ లత తెలిపారు. ఈ ప్రత్యేక రాయితీ సౌకర్యం ఈనెల నవంబర్ 30 వ తేదీ నుండి డిసెంబర్ 20 వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు.నంద్యాల నుండి హైదరాబాద్ మరియు నంద్యాల నుండి బెంగళూరు ప్రయాణించు ప్రయాణికులు ఏపీఎస్ఆర్టీసీ కల్పిస్తున్న ఈ ప్రత్యేక రాయితీ సౌకర్యం ను సద్వినియోగం చేసుకొనవలెనని నంద్యాల డిపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.

# బైబిల్ మిషన్ దైవధ్యాన మందిరంలో సేవకుల సదస్సు దైవ సేవకులకు బట్టలు పంపిణీ.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. దేవుని మహా కృపను బట్టి ఈరోజు 28 శనివారం నంద్యాల





మహా పట్టణంలో బైబిల్ మిషన్ 70 వారాల ఉపవాస ప్రార్థన ముగింపు సందర్భముగా వందలాది దైవ సేవకులు దైవ సేవకురాలు దైవ విశ్వాసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయుటకు వివిధ గ్రామాల నుండి సమైక్య సంఘములు హాజరయ్యారు. నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు మెగా మార్ట్ ఎదురుగా దైవ ధ్యాన మందిరం బైబిల్ మిషన్ వారి ద్వారా ప్రతి శనివారం నిర్వహిస్తూ వచ్చిన భక్తులకు ఉచిత భోజనం, ఉచిత నూతన వస్త్రములు, ఉచితమైన దైవ సందేశం బైబిల్ మిషన్ ఏవో రెవ డాక్టర్ బందెల రాజు ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ చాలామందికి స్వస్థత రక్షణ రాకడ సిద్ధపాటు కల్పిస్తూ ప్రతి శనివారం జరిగించు ఈ 70 వారం ఒక ప్రత్యేకమైన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య సందేశకులుగా రెవ ఓబుల్ రావు, హుబ్లీ దైవ వర్తమానికులుగా వచ్చి ఈ కార్యక్రమంలో దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో 260 పాస్టర్లు, 300 దైవ సేవకురాలకు చీరలు డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అందనం ఏసన్న మరియు క్రిస్టియన్ జేఏసీ పాస్టర్ జాన్ ఎం మరియు బ్రదర్ పుటికల బెన్ హిన్ కడియం అనిల్ కుమార్, లాయర్ విలియం మరియు దైవ సేవకురాలు కవితమ్మ, ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు

## బీటీ నాయుడు సొంతూరులో

# సర్పంచ్, ఎంపీటీసీ ఏకగ్రీవం.

**--జుమ్మాలదిన్నెలో ఏకగ్రీవ ఎన్నికలతో హర్షాతిరేకాలు..**

**-ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు ఘన సన్మానం.**

ఆదోని (పల్లె వెలుగు): ఎమ్మెల్సీ బీటీ నాయుడు సొంత గ్రామమైన కోసిగి మండలం



జుమ్మాలదిన్నెలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సర్పంచ్ అభ్యర్థిగా యేసు, ఎంపీటీసీ అభ్యర్థిగా డానియల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం గ్రామ పెద్దలు, ప్రముఖులు ఎమ్మెల్సీ బీటీ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఏకగ్రీవ ఎన్నికలు గ్రామ ప్రజల ఐక్యతకు, సమష్టి నిర్ణయానికి నిదర్శనమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి పంచాయతీకి మరిన్ని నిధులు సమకూరితే గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.


# చికిత్స పొందుతూ మహిళ మృతి

మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన సరోజ (46) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిందని ఎస్సై ఎల్.శివాంజల్ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లుగా బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసును హత్యకేసుగా నమోదు చేశామనన్నారు. ఈనెల 22వ తేదీన పుట్టుపల్లె గ్రామానికి చెందిన ఎస్. కర్ణ అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేయడం జరిగిందన్నారు. ఆమెను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. మెరుగైన చికిత్సకోసం కర్నూలు తరలించగా వైద్యం పొందుతూ కోలుకోలేక మృతి చెందారన్నారు. నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

### చలికాలంలో జలుబు, గొంతు ఇబ్బందులకు నిమ్మకాయ మిరియాల

# చారు బెస్ట్ ఛాయిస్

**శీతాకాలంలో చల్లగాలులు వీస్తున్నప్పుడు నోటికి ఏదీ రుచించదు; అలాంటి వేళ వేడివేడి అన్నంలో చెంచాడు ఆవు నెయ్యి వేసి మెత్తగా చిదిమి, ఘాటైన కమ్మని నిమ్మకాయ మిరియాల చారు పోసుకుని, పక్కన కరకరలాడే సగ్గుబియ్యం లేదా మినప్పప్పు వడియాలు నంజుకుని తింటుంటే ఆ ఆనందమే వేరు. చింతపండు పులుపు, ఎర్ర కారం పొడి ఏమాత్రం వాడకుండా కేవలం తాజా అల్లం, నల్ల మిరియాలు, జీలకర్ర మరియు నిమ్మరసంతో తయారుచేసే ఈ రసం శరీరానికి తక్షణ వెచ్చదనాన్ని ఇచ్చి గొంతు నొప్పి, జలుబు నుండి గొప్ప ఉపశమనాన్ని అందిస్తుంది.**



కావలసిన పదార్థాలు: 1 గంట నానబెట్టిన పెసరపప్పు -- 2 టేబుల్ స్పూన్లు, పండిన టమాటా -- 1 మీడియం సైజు, నీళ్లు -- 2 కప్పులు, తాజా అల్లం -- 2 అంగుళాల ముక్క, జీలకర్ర -- అర టీస్పూన్, రాళ్ల ఉప్పు -- రుచికి సరిపడా, వంట నూనె -- 1½ నుండి 2 టేబుల్ స్పూన్లు, తుంచిన ఎండుమిరపకాయలు -- 2, ఆవాలు -- అర టీస్పూన్, తాజా కరివేపాకు -- 1 రెమ్మ, ఇంగువ పొడి -- పావు టీస్పూన్ కంటే తక్కువ, తాజా కొత్తిమీర తరుగు -- గుప్పెడు, నల్ల మిరియాల పొడి -- 1 నుండి 1½ టీస్పూన్, నిమ్మకాయలు -- 3 మీడియం సైజు.

కావలసిన పదార్థాలు: 1 గంట నానబెట్టిన పెసరపప్పు -- 2 టేబుల్ స్పూన్లు, పండిన టమాటా -- 1 మీడియం సైజు, నీళ్లు -- 2 కప్పులు, తాజా అల్లం -- 2 అంగుళాల ముక్క, జీలకర్ర -- అర టీస్పూన్, రాళ్ల ఉప్పు -- రుచికి సరిపడా, వంట నూనె -- 1½ నుండి 2 టేబుల్ స్పూన్లు, తుంచిన ఎండుమిరపకాయలు -- 2, ఆవాలు -- అర టీస్పూన్, తాజా కరివేపాకు -- 1 రెమ్మ, ఇంగువ పొడి -- పావు టీస్పూన్ కంటే తక్కువ, తాజా కొత్తిమీర తరుగు -- గుప్పెడు, నల్ల మిరియాల పొడి -- 1 నుండి 1½ టీస్పూన్, నిమ్మకాయలు -- 3 మీడియం సైజు.

తయారీ విధానం: ఒక గిన్నెలో 2 టేబుల్ స్పూన్ల పెసరపప్పును శుభ్రంగా కడిగి 1 గంట పాటు నానబెట్టుకోవాలి. పాన్‌లోకి నానిన పెసరపప్పు, పైభాగంలో గాట్లు పెట్టిన 1 పండిన టమాటా, 2 కప్పుల నీళ్లు పోసి మూతపెట్టి మీడియం



మంటపై పప్పు మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఉడికిన తర్వాత టమాటాపై ఉన్న తొక్కను తొలగించి.. పప్పుగుత్తితో పప్పు మెత్తగా, టమాటా ముక్కలు అక్కడక్కడ తగిలేలా కచ్చాపచ్చాగా మెదిపి పక్కన ఉంచుకోవాలి.

తయారీ విధానం: ఒక గిన్నెలో 2 టేబుల్ స్పూన్ల పెసరపప్పును శుభ్రంగా కడిగి 1 గంట పాటు నానబెట్టుకోవాలి. పాన్‌లోకి నానిన పెసరపప్పు, పైభాగంలో గాట్లు పెట్టిన 1 పండిన టమాటా, 2 కప్పుల నీళ్లు పోసి మూతపెట్టి మీడియం మంటపై పప్పు మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఉడికిన తర్వాత టమాటాపై ఉన్న తొక్కను తొలగించి.. పప్పుగుత్తితో పప్పు మెత్తగా, టమాటా ముక్కలు అక్కడక్కడ తగిలేలా కచ్చాపచ్చాగా మెదిపి పక్కన ఉంచుకోవాలి.

రోట్లో 2 అంగుళాల అల్లం ముక్క, కొద్దిగా రాళ్ల ఉప్పు, అర టీస్పూన్ జీలకర్ర వేసి కచ్చాపచ్చాగా



దంచి సిద్ధంగా పెట్టుకోవాలి. స్టవ్‌పై చారు గిన్నె పెట్టి 1½ నుండి 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడిచేయాలి. నూనె కాగిన తర్వాత 2 తుంచిన ఎండుమిర్చి, అర టీస్పూన్ ఆవాలు వేసి చిటపటలాడనివ్వాలి. ఇందులోకి దంచి పెట్టుకున్న అల్లం-జీలకర్ర ముద్ద వేసి ఘాటు తగ్గకుండా కేవలం ఒక్క నిమిషం మాత్రమే వేయించాలి. ఆ తర్వాత కరివేపాకు రెమ్మ, కొద్దిగా ఇంగువ వేసి వేగిన వెంటనే.. మెదిపి పెట్టుకున్న పప్పు-టమాటా మిశ్రమాన్ని పోసి హై ఫ్లేమ్‌పై ఒక పొంగు రానివ్వాలి.

రోట్లో 2 అంగుళాల అల్లం ముక్క, కొద్దిగా రాళ్ల ఉప్పు, అర టీస్పూన్ జీలకర్ర వేసి కచ్చాపచ్చాగా దంచి సిద్ధంగా పెట్టుకోవాలి. స్టవ్‌పై చారు గిన్నె పెట్టి 1½ నుండి 2 టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడిచేయాలి. నూనె కాగిన తర్వాత 2 తుంచిన ఎండుమిర్చి, అర టీస్పూన్ ఆవాలు వేసి చిటపటలాడనివ్వాలి. ఇందులోకి దంచి పెట్టుకున్న అల్లం-జీలకర్ర ముద్ద వేసి ఘాటు తగ్గకుండా కేవలం ఒక్క నిమిషం మాత్రమే వేయించాలి. ఆ తర్వాత కరివేపాకు రెమ్మ, కొద్దిగా ఇంగువ వేసి వేగిన వెంటనే.. మెదిపి పెట్టుకున్న పప్పు-టమాటా మిశ్రమాన్ని పోసి హై ఫ్లేమ్‌పై ఒక పొంగు రానివ్వాలి.

పప్పు మిశ్రమం ఒక పొంగు వచ్చిన తర్వాత అందులో 750 మి.లీ. (3 కప్పులు) నీళ్లు, గుప్పెడు సన్నగా తరిగిన కొత్తిమీర వేసి హై



ఫ్లేమ్‌పై బాగా తెర్లేలా మరిగించాలి. చారు మరుగుతున్నప్పుడు ఉప్పు సరిచూసి అవసరమైతే సర్దుబాటు చేసుకోవాలి. ఇప్పుడు కొద్దిగా పచ్చి అల్లాన్ని గ్రేటర్‌తో సన్నగా తురిమి నేరుగా చారులో వేయాలి. ఆ తర్వాత 1 నుండి 1½ టీస్పూన్ నల్ల మిరియాల పొడి వేసి కలిపి, ఒక్క పొంగు రాగానే వెంటనే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.

పప్పు మిశ్రమం ఒక పొంగు వచ్చిన తర్వాత అందులో 750 మి.లీ. (3 కప్పులు) నీళ్లు, గుప్పెడు సన్నగా తరిగిన కొత్తిమీర వేసి హై ఫ్లేమ్‌పై బాగా తెర్లేలా మరిగించాలి. చారు మరుగుతున్నప్పుడు ఉప్పు సరిచూసి అవసరమైతే సర్దుబాటు చేసుకోవాలి. ఇప్పుడు కొద్దిగా పచ్చి అల్లాన్ని గ్రేటర్‌తో సన్నగా తురిమి నేరుగా చారులో వేయాలి. ఆ తర్వాత 1 నుండి 1½ టీస్పూన్ నల్ల మిరియాల పొడి వేసి కలిపి, ఒక్క పొంగు రాగానే వెంటనే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. స్టవ్ ఆఫ్ చేసిన తర్వాత చారు మరగడం ఆగిపోయాక.. 3 నిమ్మకాయల రసాన్ని పోసి గరిటెతో బాగా కలపాలి. పులుపు సరిచూసుకుని అవసరమైతే మరికొంత నిమ్మరసం కలుపుకోవచ్చు. అంతే, నోరూరించే శీతాకాలపు స్పెషల్ 'వేడివేడి నిమ్మకాయ మిరియాల చారు' సిద్ధం! వేడివేడి అన్నంలో నెయ్యి వేసి కలిపి ఈ రసం పోసుకుని తిన్నా లేదా సాయంత్రం వేళ సూప్‌లా వేడివేడిగా తాగినా.. మిరియాలు, అల్లం ఘాటుతో గొంతుకు ఎంతో హాయినిస్తూ శరీరానికి నూతన ఉత్సాహాన్ని ఇస్తుంది!




స్టవ్ ఆఫ్ చేసిన తర్వాత చారు మరగడం ఆగిపోయాక.. 3 నిమ్మకాయల రసాన్ని పోసి గరిటెతో బాగా కలపాలి. పులుపు సరిచూసుకుని అవసరమైతే మరికొంత నిమ్మరసం కలుపుకోవచ్చు. అంతే, నోరూరించే శీతాకాలపు స్పెషల్ 'వేడివేడి నిమ్మకాయ మిరియాల చారు' సిద్ధం! వేడివేడి అన్నంలో నెయ్యి వేసి కలిపి ఈ రసం పోసుకుని తిన్నా లేదా సాయంత్రం వేళ సూప్‌లా వేడివేడిగా తాగినా.. మిరియాలు, అల్లం ఘాటుతో గొంతుకు ఎంతో హాయినిస్తూ శరీరానికి నూతన ఉత్సాహాన్ని ఇస్తుంది!

### సిటీలో మీరు తినే చేపలు సూపర్ ఫ్రెష్ అనుకుంటున్నారా..?

# అసలు విషయం తెలిస్తే షాకే..

హైదరాబాద్‌లోని రాంనగర్, బేగంబజార్ చేపల మార్కెట్లలో ఎ+ ఖూఖీజు టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోజుల తరబడి నిల్వ ఉంచిన



కుళ్లిన చేపలను తాజాగా ఉన్నట్లుగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చేపలు పాడవకుండా ఉండేందుకు హానికర రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు పలు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. **సిటీలో మీరు తినే చేపలు సూపర్ ఫ్రెష్ అనుకుంటున్నారా..? అసలు విషయం తెలిస్తే షాకే..** మనం ఎంతో ఇష్టంగా తినే చేపలు నిజంగానే తాజాగా ఉన్నాయా? లేక రోజుల తరబడి నిల్వ ఉంచి, కుళ్లిపోయిన చేపలను మనకు అంటగడుతున్నారా? హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెలుగుచూసిన విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నగరంలోని ప్రధాన చేపల విక్రయ కేంద్రాలైన రాంనగర్, బేగంబజార్ మార్కెట్లలో కుళ్లిపోయిన చేపలను తాజాగా ఉన్నట్లుగా నమ్మించి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఎ+ ఖూఖీజు టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు ఉల్లంఘనలు బయటపడ్డాయి. **కుళ్లిన చేపలే తాజావంటూ విక్రయాలు!**

రాంనగర్, బేగంబజార్ మార్కెట్లలోని పలు దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజుల తరబడి నిల్వ ఉంచిన, కుళ్లిపోయిన చేపలను తాజాగా ఉన్నట్లుగా చూపిస్తూ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వాటిని అక్కడికక్కడే స్వాధీనం చేసుకున్నారు. చేపలు ఎక్కువ రోజులు పాడవకుండా ఉండేందుకు కొందరు వ్యాపారులు ప్రజారోగ్యానికి హాని కలిగించే రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైందని అధికారులు తెలిపారు. **అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ** చేపల విక్రయ కేంద్రాల్లో కనీస పరిశుభ్రత ప్రమాణాలు కూడా పాటించడం లేదని అధికారులు గుర్తించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో చేపలను నిల్వ ఉంచుతున్నట్లు వెల్లడించారు. ఆహార పదార్థాల విక్రయానికి అవసరమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా దుకాణాల వద్ద సాధారణ ట్రేడ్ లైసెన్సులు మాత్రమే ఉండగా, ఆహార విక్రయాలకు తప్పనిసరిగా ఉండాల్సిన ఖీూూ× ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదని గుర్తించారు. **నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు**

నాణ్యతా ప్రమాణాలు పాటించని పలు దుకాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రతి చేపల వ్యాపారి తప్పనిసరిగా ఖీూూ× లైసెన్స్ పొందాలని ఆదేశించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించేలా కుళ్లిన చేపలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చేపలు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన సూచిస్తోంది. తాజాదనం, పరిశుభ్రతపై అనుమానం ఉంటే అలాంటి చేపలను కొనుగోలు చేయకపోవడమే మంచిది.

# రుచిగా తింటూ బరువు తగ్గాలా.. ఈ బేబీ కార్న్ 65 ట్రై చేయండి

రెస్టారెంట్లలో స్టార్టర్స్ అనగానే మొదటగా గుర్తొచ్చే వాటిలో 'బేబీ కార్న్ 65' ఒకటి. అయితే ఇంట్లో బేబీ



కార్న్ ఫ్రై చేసినప్పుడు పిండి కోటింగ్ ముక్కలకు పట్టకుండా నూనెలో విడిపోవడం లేదా కాసేపటికే మెత్తబడిపోవడం లాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. కానీ 'విలేజ్ సిరి కుకింగ్' వెంకట శిరీష గారు చూపించిన పద్ధతిలో పిండి నిష్పత్తిని సరిగ్గా వాడుతూ, వేయించేటప్పుడు చిన్న చిన్న మెళకువలు పాటిస్తే.. బయట హోటల్ కంటే ఎంతో కరకరలాడుతూ, లోపల జ్యూసీగా ఉండే బేబీ కార్న్ 65ని ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు. కావలసిన పదార్థాలు: చిన్న ముక్కలుగా తరిగిన లేత బేబీ కార్న్ -- 250 గ్రాములు, కార్న్ ఫ్లోర్ -- 1 టేబుల్ స్పూన్, బియ్యప్పిండి -- 1 టేబుల్ స్పూన్, కారం పొడి -- 1 టేబుల్ స్పూన్, గరం మసాలా పొడి -- అర టేబుల్ స్పూన్, అల్లం-వెల్లుల్లి పేస్ట్ -- అర టేబుల్ స్పూన్, పసుపు -- చిటికెడు, ధనియాల పొడి -- పావు టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన వెల్లుల్లి తరుగు -- 1 టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన పచ్చిమిర్చి తరుగు -- 2 టేబుల్ స్పూన్లు, సన్నగా తరిగిన ఉల్లిపాయ తరుగు -- 4 టేబుల్ స్పూన్లు, టమాటో సాస్ / కెచప్ -- 1 టేబుల్ స్పూన్, తాజా కరివేపాకు -- 2 రెమ్మలు, రుచికి సరిపడా సాల్ట్, వంట నూనె -- డీప్ ఫ్రై చేయడానికి సరిపడా.

కార్న్ ఫ్రై చేసినప్పుడు పిండి కోటింగ్ ముక్కలకు పట్టకుండా నూనెలో విడిపోవడం లేదా కాసేపటికే మెత్తబడిపోవడం లాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. కానీ 'విలేజ్ సిరి కుకింగ్' వెంకట శిరీష గారు చూపించిన పద్ధతిలో పిండి నిష్పత్తిని సరిగ్గా వాడుతూ, వేయించేటప్పుడు చిన్న చిన్న మెళకువలు పాటిస్తే.. బయట హోటల్ కంటే ఎంతో కరకరలాడుతూ, లోపల జ్యూసీగా ఉండే బేబీ కార్న్ 65ని ఇంట్లోనే సులభంగా చేసుకోవచ్చు. కావలసిన పదార్థాలు: చిన్న ముక్కలుగా తరిగిన లేత బేబీ కార్న్ -- 250 గ్రాములు, కార్న్ ఫ్లోర్ -- 1 టేబుల్ స్పూన్, బియ్యప్పిండి -- 1 టేబుల్ స్పూన్, కారం పొడి -- 1 టేబుల్ స్పూన్, గరం మసాలా పొడి -- అర టేబుల్ స్పూన్, అల్లం-వెల్లుల్లి పేస్ట్ -- అర టేబుల్ స్పూన్, పసుపు -- చిటికెడు, ధనియాల పొడి -- పావు టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన వెల్లుల్లి తరుగు -- 1 టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన పచ్చిమిర్చి తరుగు -- 2 టేబుల్ స్పూన్లు, సన్నగా తరిగిన ఉల్లిపాయ తరుగు -- 4 టేబుల్ స్పూన్లు, టమాటో సాస్ / కెచప్ -- 1 టేబుల్ స్పూన్, తాజా కరివేపాకు -- 2 రెమ్మలు, రుచికి సరిపడా సాల్ట్, వంట నూనె -- డీప్ ఫ్రై చేయడానికి సరిపడా.

**తయారీ విధానం: లేత బేబీ కార్న్‌లను నీటితో శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసి ఒక మిక్సింగ్ బౌల్‌లో వేయాలి. ఇందులో చిటికెడు పసుపు, 1 టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ గరం మసాలా, అర టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్, రుచికి సరిపడా ఉప్పు వేయాలి. ఆ తర్వాత 1 టేబుల్ స్పూన్ కార్న్ ఫ్లోర్, 1 టేబుల్ స్పూన్ బియ్యప్పిండి వేసి పొడిపొడిగా అన్ని ముక్కలకు పట్టేలా బాగా కలపాలి. ఇప్పుడు చేతితో కొద్దికొద్దిగా నీళ్లు చిలకరిస్తూ.. పిండి జారుడుగా కాకుండా బేబీ కార్న్ ముక్కలకు గట్టిగా అతుక్కునేలా కలుపుకుని పక్కన ఉంచుకోవాలి.**

**తయారీ విధానం: లేత బేబీ కార్న్‌లను నీటితో శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసి ఒక మిక్సింగ్ బౌల్‌లో వేయాలి. ఇందులో చిటికెడు పసుపు, 1 టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ గరం మసాలా, అర టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్, రుచికి సరిపడా ఉప్పు వేయాలి. ఆ తర్వాత 1 టేబుల్ స్పూన్ కార్న్ ఫ్లోర్, 1 టేబుల్ స్పూన్ బియ్యప్పిండి వేసి పొడిపొడిగా అన్ని ముక్కలకు పట్టేలా బాగా కలపాలి. ఇప్పుడు చేతితో కొద్దికొద్దిగా నీళ్లు చిలకరిస్తూ.. పిండి జారుడుగా కాకుండా బేబీ కార్న్ ముక్కలకు గట్టిగా అతుక్కునేలా కలుపుకుని పక్కన ఉంచుకోవాలి.**

స్టవ్‌పై కడాయి పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె పోసి మీడియం వేడిలో కాగనివ్వాలి. మసాలా పట్టించిన బేబీ కార్న్ ముక్కలను ఒకదానికొకటి అంటుకోకుండా ఒక్కొక్కటిగా విడివిడిగా నూనెలో వేయాలి. మంటను మీడియం ఫ్లేమ్‌లోనే ఉంచి.. ముక్కలు లోపలి వరకు ఉడికి బయట ఎర్రగా, కరకరలాడే వరకు వేయించి జల్లిగరిటెతో ప్లేట్‌లోకి తీసుకోవాలి.

**స్టవ్‌పై కడాయి పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె పోసి మీడియం వేడిలో కాగనివ్వాలి. మసాలా పట్టించిన బేబీ కార్న్ ముక్కలను ఒకదానికొకటి అంటుకోకుండా ఒక్కొక్కటిగా విడివిడిగా నూనెలో వేయాలి. మంటను మీడియం ఫ్లేమ్‌లోనే ఉంచి.. ముక్కలు లోపలి వరకు ఉడికి బయట ఎర్రగా, కరకరలాడే వరకు వేయించి జల్లిగరిటెతో ప్లేట్‌లోకి తీసుకోవాలి.**

కడాయిలో అదనపు నూనెను తీసివేసి కేవలం 2 టేబుల్ స్పూన్ల నూనె మాత్రమే ఉంచాలి. వేడి నూనెలో 1 టేబుల్ స్పూన్ సన్నని వెల్లుల్లి తరుగు, 2 టేబుల్ స్పూన్ల సన్నని పచ్చిమిర్చి తరుగు వేసి పచ్చివాసన పోయేలా వేయించాలి. ఆ తర్వాత 4 టేబుల్ స్పూన్ల సన్నని ఉల్లిపాయ తరుగు వేసి మంచి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేంత వరకు వేపాలి. ఇందులో పావు టేబుల్ స్పూన్ ధనియాల పొడి, పావు టేబుల్ స్పూన్ కారం, చిటికెడు ఉప్పు, 1 టేబుల్ స్పూన్ టమాటో సాస్ మరియు తాజా కరివేపాకు వేసి బాగా కలపాలి.

కడాయిలో అదనపు నూనెను తీసివేసి కేవలం 2 టేబుల్ స్పూన్ల నూనె మాత్రమే ఉంచాలి. వేడి నూనెలో 1 టేబుల్ స్పూన్ సన్నని వెల్లుల్లి తరుగు, 2 టేబుల్ స్పూన్ల సన్నని పచ్చిమిర్చి తరుగు వేసి పచ్చివాసన పోయేలా వేయించాలి. ఆ తర్వాత 4 టేబుల్ స్పూన్ల సన్నని ఉల్లిపాయ తరుగు వేసి మంచి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేంత వరకు వేపాలి. ఇందులో పావు టేబుల్ స్పూన్ ధనియాల పొడి, పావు టేబుల్ స్పూన్ కారం, చిటికెడు ఉప్పు, 1 టేబుల్ స్పూన్ టమాటో సాస్ మరియు తాజా కరివేపాకు వేసి బాగా కలపాలి.

ఈ సాస్ మిశ్రమంలో ముందుగా వేయించి పెట్టుకున్న క్రిస్పీ బేబీ కార్న్ ముక్కలను వేయాలి. మంటను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి ఉల్లిపాయ, సాస్ ఫ్లేవర్స్ ముక్కలన్నింటికీ బాగా పట్టేలా 2 నుండి 3 నిమిషాల పాటు కలుపుతూ టాస్ చేసి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అంతే, నోరూరించే రెస్టారెంట్ స్టైల్ 'క్రిస్పీ బేబీ కార్న్ 65' సిద్ధం! వేడివేడిగా ప్లేట్‌లో వడ్డించుకుని నిమ్మరసం పిండుకుని తింటుంటే.. బయట కరకరలాడుతూ, లోపల లేత కార్న్ తియ్యదనం, వెల్లుల్లి-కరివేపాకు ఘుమఘుమలతో పిల్లల నుండి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా లాగించేస్తారు!

ఈ సాస్ మిశ్రమంలో ముందుగా వేయించి పెట్టుకున్న క్రిస్పీ బేబీ కార్న్ ముక్కలను వేయాలి. మంటను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి ఉల్లిపాయ, సాస్ ఫ్లేవర్స్ ముక్కలన్నింటికీ బాగా పట్టేలా 2 నుండి 3 నిమిషాల పాటు కలుపుతూ టాస్ చేసి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అంతే, నోరూరించే రెస్టారెంట్ స్టైల్ 'క్రిస్పీ బేబీ కార్న్ 65' సిద్ధం! వేడివేడిగా ప్లేట్‌లో వడ్డించుకుని నిమ్మరసం పిండుకుని తింటుంటే.. బయట కరకరలాడుతూ, లోపల లేత కార్న్ తియ్యదనం, వెల్లుల్లి-కరివేపాకు ఘుమఘుమలతో పిల్లల నుండి పెద్దల వరకు ఎంతో ఇష్టంగా లాగించేస్తారు!

## మాజీ ఎమ్మెల్యే - ఎమ్మెల్సీ ని కలిసిన నూతన సర్పంచులు



రుద్రవరం. పల్లె వెలుగు : మండల పరిధిలోని పలు గ్రామాలలో వైసీపీ మద్దతుతో ఎన్నికైన నూతన సర్పంచులు వైసీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రుద్రవరం మండలంలో ఈనెల 26 న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో మండలంలోని చిత్రేనిపల్లె జవ్వాజి చిన్న మాధవ, కోటకొండ డేగాని వెంకటేష్, శ్రీరంగాపురం మండ్ల లక్ష్మీనరసమ్మ, యల్లావత్తుల దేవిశెట్టి శాంతి, టి లింగందిన్నె బద్రి పెద్ద వెంకటన్న, నరసాపురం కరణం వెంకోబరావు, పేరూరు శాగం జయమ్మ, రుద్రవరం టి లక్ష్మీనరసమ్మ వైసిపి అధిష్టానం మద్దతు వైసీపీ గ్రామ నాయకులు కార్యకర్తల మద్దతుతో గ్రామ ప్రజల ఆశీర్వాదంతో సర్పంచులుగా విజయం సాధించారు. నూతన సర్పంచులుగా ఎన్నికైన సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర రెడ్డి మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనంగా ఎంపికైన సర్పంచులను మాజీ ఎమ్మెల్యే గంగుల పూలమాలలు వేసీ అభినందనలు తెలిపారు. గ్రామాలలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైసీపీ గ్రామ నాయకులతో కలిసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల సంక్షేమ అభివృద్ధికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన సర్పంచులకు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే ను కలిసిన వారిలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉన్నారు.

## ఎమ్మిగనూరులో 24 గంటల తాగునీటి సౌకర్యం,,,,,

**-- ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి సమీక్ష,,,,,**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 28 ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కమిషనర్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే



డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి తాగునీటి పైప్‌లైన్ ప్రాజెక్టు మరియు పట్టణంలోని వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పనుల ప్రస్తుత స్థితి, పురోగతి, పూర్తి చేయాల్సిన గడువులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పనులను వేగవంతం చేసి నిర్దీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం పట్టణంలోని రాజ కాలనీ 3వ, 4వ, 7వ వార్డులు, పెద్ద కమేళా ప్రాంతాలను కౌన్సిలర్లు మణి, శ్రీలత, మరియు టికె నసీమా తో కలిసి సందర్శించి, పైప్‌లైన్ ప్రాజెక్టు పనులు, స్థానిక సమస్యలను పరిశీలించారు. ఫుట్‌పాత్‌లు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరిచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.తదనంతరం ఎస్సీ కాలనీలోని ఎంబీ చర్చను సందర్శించి, ప్రార్థనలో పాల్గొన్నారు. అలాగే వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రాబోయే పార్టీ కార్యక్రమాలు, కార్యాచరణపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు.ఎమ్మిగనూరు పట్టణానికి 24 గంటల తాగునీరు అందించడంతో పాటు, ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచాని సునీత, వైస్ చైర్మన్ తురేగల్ నజీర్ ఆహ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మరియు మున్సిపల్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు, జె, శ్రీలత టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెసొనెన్స్ జూనియర్ కళాశాల తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలి

---ఆర్ ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండం నాటి ప్రశాంత్

కడప నవంబర్ 28 విద్యా ర్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న యాజమాన్యంపై కేసు నమోదు తీసుకోవాలి. కడప నగరంలో రెసొనెన్స్ కళాశాల పేరుతో ఐఐటీ--జేఈఈ, నీట్ వంటి కోర్సుల పేర్లతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నారని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ( ఆర్ఎస్ యు) ఆధ్వర్యంలో ఆర్ ఐ ఓ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం ఆర్ ఐ ఓ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ

విద్యాశాఖ అనుమతులు లేకుండానే కళాశాలకు అన్ని అనుమతులు ఉన్నాయని ప్రచారం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, కళాశాలకు సంబంధించిన అను మతులు, గుర్తింపులు, నిర్వహణ అర్హతలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.రెసొనెన్స్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై తప్పుడు ప్రకటనల ద్వారా విద్యార్థులను మోసం చేస్తున్నారు కావున వెంటనే యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

అధికారులు ఈ వ్యవహారంపై నిర్లక్ష్యం వహిస్తే రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవహిస్తామని తొండంనాటి ప్రశాంత్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు జస్వంత్ కుమార్, జిల్లా సాయి కార్యదర్శి వంశీ, నవీన్, భాష, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలి.

**బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఘనంగా 136వ వర్ధంతి వేడుకలు.**

ఆదోని (పల్లె వెలుగు): మహాత్మా జ్యోతిరావు పూలే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే 136వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో వర్ధంతి వేడుకలను అనంతరం దస్తగిరి నాయుడు మాట్లాడుతూ.. కులవివక్ష, అంటరానితనం నిర్మూలనతో పాటు సమాజంలో సమానత్వం కోసం జ్యోతిరావు పూలే విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు మహిళా విద్యకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పూలే పోరాటం చేశారని తెలిపారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళలకు విద్య అందించేందుకు విశేష కృషి చేశారని గుర్తుచేశారు. 1848లో పూణేలో బాలికల కోసం పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు బాటలు వేశారని పేర్కొన్నారు.

జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన సామాజిక సేవలు, విద్యా ఉద్యమం నేటి తరానికి ఆదర్శమని నాయకులు అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీసీ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు పి. సాయిబాబా, తాలూకా అధ్యక్షుడు మరియాని చెన్నబసప్ప, డివిజన్ ఉపాధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, కత్తి హనుమంతరావు, స్టూడెంట్ లీడర్ హరికృష్ణ, బండారి రాజేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జయరాముడు, తాలూకా గౌరవ సలహాదారులు వీరభద్ర, సరోదే హరీష్, బి. మల్లేశ్వరప్ప, రంగస్వామి, కటిక సుధీర్, కత్తి ప్రసాద్, సుబ్రహ్మణ్యం, గోపాల్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# చీరలకు సీసాలకు ఓట్లు తాకట్టు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 28:ఓటు అంటే ఏమిటి అన్నా? ఓటు అంటే మన బిడ్డ భవిష్యత్తు. ఓటు అంటే మన ఊరి రోడ్డు. ఓటు అంటే మన పొలానికి నీరు. ఓటు అంటే మన ఆత్మగౌరవం.


**కానీ ఇప్పుడు బండి ఆత్మకూరు మండలంలో ఏం జరుగుతోంది?**

ఓటును తాకట్టు పెడుతున్నారు! ఒక చీరకు, ఒక సీసాకు, వెయ్యి రూపాయల నోటుకు ఐదేళ్ల భవిష్యత్తును అమ్మేసుకు న్నారు!

ఆడబిడ్డలకు చీర... యువకులకు సీసా!

ఎన్నికలు వచ్చాయంటే చాలు, అభ్యర్థులు బ్యాగులతో తిరుగుతున్నారు. ఆడవాళ్ల ఇంటికి వెళ్లి చీర పెడుతున్నారు. "అక్కా, ఇది మీ కోసం. మా గుర్తుకు ఓటేయండి" అంటున్నారు.

యువకుల దగ్గరకు వెళ్లి రాత్రికి సీసా పెడుతున్నారు. "తమ్ముడూ, తాగు. రేపు మాకే



ఓటేయ్" అంటున్నారు.అన్నా, ఆలోచించు! ఒక చీర ధర ఎంత? 500 రూపాయలు. ఒక సీసా ధర ఎంత? 300 రూపాయలు. ఈ 500, 300 కోసం మనం ఐదేళ్లు నోరు మూసుకోవాలా? ఐదేళ్లు రోడ్డు లేకపోయినా, నీళ్లు రాకపోయినా, అడగకూడదా?

**ఓటు అమ్మితే, అడిగే హక్కు పోతుంది!**

ఒకసారి చీర తీసుకుని, సీసా తీసుకుని ఓటేస్తే, ఆ తర్వాత ఆ నాయకుడిని అడగడానికి మనకు మొహం ఉంటుందా అన్నా? "ఏమయ్యా, మా ఊరికి రోడ్డు ఏది?" అని అడిగితే, వాడు నవ్వుతూ అంటాడు – "నీకు ముందే ఇచ్చాను కదా చీర, ఇంకేం అడుగుతావు?" అని.

అదే ఖానీ అన్నా! ప్రజాస్వామ్యం అంటే ఓటు వేయడం కాదు. ప్రజాస్వామ్యం అంటే ఓటేసిన తర్వాత ప్రశ్నించడం. ఆ ప్రశ్నించే హక్కునే ఇప్పుడు చీరలకు, సీసాలకు తాకట్టు పెడుతున్నారు.

**యువకుల్లారా, మేలుకోండి!**

అన్నా, పెద్దవాళ్లు అయితే ఏదో ఆశకు అమ్ముడుపోతున్నారనుకో. కానీ యువకులు? చదువుకున్న యువకులు కూడా సీసాకు లొంగిపోతుంటే, ఈ ఊరికి దిక్కెవరు?

సీసా తాగితే ఒక రాత్రి మత్తు వస్తుంది. కానీ ఆ మత్తులో వేసిన ఓటు వల్ల ఐదేళ్లు ఊరంతా మత్తులోనే ఉంటుంది. అభివృద్ధి అనే మాటే ఉండదు.

ఒకప్పుడు ఓటు కోసం ప్రాణాలు ఇచ్చారు. ఇప్పుడు ఓటును ప్రాణం లేని చీరకు, సీసాకు అమ్ముతున్నారు. ఇది కాదు అన్నా ప్రజాస్వామ్యం. ఇది ప్రజాస్వామ్యానికి ఖూనీ!

**గుర్తు పెట్టుకోండి -**

చీర చినిగిపోతుంది, సీసా ఖాళీ అవుతుంది, డబ్బు అయిపోతుంది. కానీ మీరు వేసిన ఓటు మాత్రం ఐదేళ్లు మిమ్మల్ని వెంటాడుతుంది.ఓటును అమ్మొద్దు. ఓటును తాకట్టు పెట్టొద్దు. ఓటు మన ఆత్మగౌరవం. దాన్ని కాపాడుకుందాం.

# నందవరంలో పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం,,,,,,

**14 సర్పంచ్ స్థానాలు.. 160 వార్డు సభ్యుల స్థానాలకు నేడు పోలింగ్.,,,,,,**

**సాయంత్రం 6 గంటల్లోగా అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలే అవకాశం,,,,,**

నందవరం, పల్లె వెలుగు నవంబర్ 28 నందవరం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సమరానికి తెరలేవనుంది. గత వారం రోజులుగా హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారానికి తెరపడటంతో అభ్యర్థులు, రాజకీయ నాయకులు, ఓటర్లు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పోలింగ్ సమయం ఆసన్నమైంది. మండలంలోని పెద్దకొత్తిలి గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కావడంతో మిగిలిన





14 సర్పంచ్ స్థానాలతో పాటు 178 వార్డు సభ్యుల స్థానాలకు గాను 160 స్థానాలకు (మిగతా స్థానాలు ఏకగ్రీవం) ఆదివారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.మండల వ్యాప్తంగా 160 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించి, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. ఎన్నికల విధుల కోసం 205 మంది ప్రిసైడింగ్ అధికారులు, 359 మంది ఓపీఓలు, 20 మంది మైక్రో అబ్జర్వర్లు, ఐదుగురు వీడియో గ్రాఫర్లు, ఐదుగురు రిటర్నింగ్ అధికారులు, ముగ్గురు జోనల్ అధికారులను నియమించినట్లు వెల్లడించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై తిమ్మారెడ్డి తెలిపారు. అవసరమైన పోలీసు బలగాలతో పాటు పారామిలటరీ దళాలను కూడా బందోబస్తులో వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మొత్తంగా వారం రోజులుగా సాగిన ప్రచార పర్వానికి ముగింపు పలుకుతూ నేడు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రామాల్లో ఎవరి బలమెంతో, ప్రజల మద్దతు ఎవరికి ఉందో ఓటరు తీర్పుతో తేలనుంది. సాయంత్రం 6 గంటల్లోగా సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల రాజకీయ భవితవ్యం వెల్లడికానుండటంతో మండలవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల అధికారి శ్రీనాథ్ రెడ్డి, ఎంపీడీవో పుల్లయ్య, డిప్యూటీ ఎంపీడీవో సందీప్, ఏవో కృష్ణమూర్తి, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com